RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM : HYDERABAD

సంపుటి : 11 సంచిక : 92 శనివారం 15 - 11 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

## జూబ్లీహిల్స్ గడ్డపై నవీన్ యాదవ్ జయకేతనం

- జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ ఘన విజయం
- నవీన్ యాదవ్‌కు దక్కిన జూబ్లీహిల్స్ కిరీటం
- మాగంటి సునీతపై నవీన్ యాదవ్ జయకేతనం
- 24,658 ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ ఘన విజయం
- తొలి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు కాంగ్రెస్ ఆధిపత్యం
- ఈసీ నుంచి వెలువడాల్సిన అధికారిక ప్రకటన
- 2009లో రాజకీయంలో అడుగుపెట్టిన నవీన్ యాదవ్ 16 ఏళ్ల నిరీక్షణకు ఇప్పుడు ఫలితం



అన్ని ప్రధాన పార్టీలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,658 ఓట్ల భారీ ఆధిక్యంతో జయకేతనం ఎగురవేశారు. ఎన్నికల సంఘం నుంచి దీనిపై - మిగతా 2 లో

## రెండేళ్ల పాలనను ప్రజలు నిశితంగా పరిశీలించి తీర్పు ఇచ్చారు

- సీఎం రేవంత్ రెడ్డి
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ఘనవిజయం
- భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మీడియా సమావేశం
- ఈ గెలుపు తమ బాధ్యతను మరింతగా పెంచిందన్న రేవంత్ రెడ్డి
- కేసీఆర్ రాజకీయాల్లో క్రియాశీలకంగా లేనందువల్ల ఆయన గురించి మాట్లాడబోనన్న రేవంత్
- కేటీఆర్‌కు అహంకారం పోలేదని, హరీశ్ రావు అసహనం తగ్గించుకోవాలని సూచన



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం తమ బాధ్యతను మరింత పెంచిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్?మీట్‌లో సీఎం మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం హైదరాబాద్ నగర ప్రజల్లో కాంగ్రెస్‌పై నమ్మకం క్రమంగా పెరుగుతోందన్నారు. జూబ్లీహిల్స్‌లో విజయం అందించిన ప్రజలకు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నవీన్ యాదవ్ విజయం కోసం కృషి చేసినటువంటి పార్టీ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ నగరంలో హస్తం పార్టీకి సరైన ఫలితాలు రాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనను - మిగతా 2 లో

## ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారన్న మోదీ



- బీహార్ ఎన్నికల ఫలితాలపై మోదీ, నితీశ్, జైశంకర్
- వికసిత్ భారత్‌పై విశ్వాసం పెట్టుకున్నారన్న అమిత్ షా
- కూటమి ప్రభుత్వం పట్ల విశ్వాసంతో ప్రజలు గెలిపించారన్న జైశంకర్

బీహార్ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి విజయం సాధించడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తదితరులు 'ఎక్స్' వేదికగా స్పందించారు. రాష్ట్ర ప్రజలు అద్భుతమైన తీర్పు ఇచ్చారని ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నారు. బీహార్‌లో సుపరిపాలన, అభివృద్ధి గెలిపించాయని అన్నారు. బీహార్ అభివృద్ధికి నూతన సంకల్పంతో పని చేసేందుకు ఈ చారిత్రక విజయం మరింత శక్తినిస్తుందని అన్నారు.సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ తన సందేశాన్ని పంచుకున్నారు. "సుపరిపాలన విజయం సాధించింది. అభివృద్ధి విజయం సాధించింది. ప్రజా సంక్షేమ స్ఫూర్తి విజయం సాధించింది. సామాజిక న్యాయం - మిగతా 2 లో

## "టైగర్ అభీ జిందా హై"....

- తిరుగులేని విజయంతో విమర్శకుల నోళ్లు మూయించిన నితీశ్ కుమార్
- బీహార్ ఎన్నికల కౌంటింగ్‌లో ఎన్డీఏ ఘన విజయం దిశగా పయనం
- "టైగర్ అభి జిందా హై" నినాదాన్ని నిజం చేసిన ఫలితాల సరళి
- ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నాయకత్వానికే ప్రజల పట్టం
- విమర్శలను తిప్పికొట్టి తన రాజకీయ పట్టు నిలుపుకున్న నితీశ్
- 'జంగిల్ రాజ్' నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కించిన నేతగా చెరగని ముద్ర



బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ముందు పాట్నాలోని జనతాదళ్ (యునైటెడ్) కార్యాలయం వెలుపల వెలసిన ఓ భారీ పోస్టర్ అందరి దృష్టిని ఆకర్షించింది. "టైగర్ అభీ జిందా హై" (పులి ఇంకా బతికే ఉంది) అన్నదే దాని సారాంశం. శుక్రవారం ఓట్ల లెక్కింపు ప్రారంభమై, ఫలితాల సరళి వెలువడుతున్న కొద్దీ ఆ నినాదం కేవలం ప్రచారం కోసం కాదని, బీహార్ రాజకీయాల్లో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చెక్కుచెదరని శక్తికి నిదర్శనమని స్పష్టమవుతోంది.ఎన్నికల సంఘం వెల్లడిస్తున్న ట్రెండ్స్ ప్రకారం, ఎన్డీఏ కూటమి స్పష్టమైన ఆధిక్యంతో దూసుకుపోతోంది. మొత్తం 243 స్థానాలున్న అసెంబ్లీలో, మ్యాజిక్ ఫిగర్ 122 కాగా, ఎన్డీఏ మధ్యాహ్నం 2:30 గంటల సమయానికే 200కు పైగా స్థానాల్లో ఆధిక్యంలో నిలిచింది. ఈ భారీ ఆధిక్యం కేవలం కూటమి లెక్కలనే కాకుండా, బీహార్‌లో ఎన్డీఏకు నితీశ్ కుమారే అసలైన గుర్తింపు అనే వాస్తవాన్ని మరోసారి రుజువు చేసింది.

***'జంగిల్ రాజ్' నుంచి సుపరిపాలన వైపు..***

- మిగతా 2 లో

## నవీన్ యాదవ్ గెలుపును అధికారికంగా ప్రకటించిన ఈసీ





పార్టీలవారీగా ఓట్లు, నోటాకు పడ్డ ఓట్లు ఇవే!

జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ ఘన విజయం

24,729 ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ గెలుపు

నోటాకు ఓటు వేసిన 924 మంది ఓటర్లు

## పెట్టుబడులకు ఏపీనే స్వర్గధామం



- విశాఖలో ఘనంగా ప్రారంభమైన సీఐఐ భాగస్వామ్య సదస్సు
- పెట్టుబడులకు ఏపీని ఎంచుకోవడానికి మూడు కారణాలున్నాయన్న లోకేశ్
- చంద్రబాబు నాయకత్వమే మొదటి బలం అని వెల్లడి
- మీకంటే వేగంగా పనిచేస్తామని పెట్టుబడిదారులకు హామీ
- ఏపీలో డబుల్ ఇంజన్ బుల్లెట్ ట్రైన్ సర్కార్ ఉందని వ్యాఖ్య
- రాష్ట్రాన్ని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని ధీమా

పెట్టుబడులకు ఏపీ ఎందుకు అత్యంత అనుకూలమైన గమ్యస్థానమో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ వివరించారు. రాష్ట్రంలో అనుభవజ్ఞమైన నాయకత్వం, వేగవంతమైన పాలన, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం ఉన్నాయని, పెట్టుబడిదారులు ఎలాంటి సందేహాలు లేకుండా ముందుకు రావచ్చని ఆయన భరోసా ఇచ్చారు. విశాఖపట్నంలోని ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో కూటమి ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈ సదస్సును ప్రారంభించారు. - మిగతా 2 లో

## ఏపీలో కొత్త శకం

## డ్రోన్, స్పేస్ సిటీలకు శంకుస్థాపన

- విశాఖలో సీఐఐ సదస్సు వేదికగా చారిత్రాత్మక ఘట్టం
- రాష్ట్రంలో డ్రోన్ సిటీ, ట్విన్ స్పేస్ సిటీలకు వర్చువల్ శంకుస్థాపన
- కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రులు
- చంద్రబాబు దార్శనికతను కొనియాడిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- ఓర్వకల్లులో 300 ఎకరాల్లో డ్రోన్ సిటీ నిర్మాణం
- ఈ ప్రాజెక్టులతో భారీగా పెట్టుబడులు, ఉద్యోగావకాశాలు




ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏరోస్పేస్, అంతరిక్ష రంగాల్లో చారిత్రాత్మక ముందడుగు వేసింది. దేశంలోనే తొలిసారిగా ఏర్పాటు కానున్న 'డ్రోన్ సిటీ', 'ట్విన్ స్పేస్ సిటీస్' ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వాణిజ్య-పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ శుక్రవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు ఈ కార్యక్రమానికి వేదికైంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, శ్రీనివాస వర్మ, రాష్ట్ర మంత్రులు టీజీ భారత్, బీసీ జనార్ధన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ విజయానంద్, ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ సతీష్ రెడ్డి, ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, డ్రోన్, స్పేస్ సిటీలకు శంకుస్థాపన చేసుకోవడం రాష్ట్ర చరిత్రలో - మిగతా 2 లో

## ఏపీలో భారీ పెట్టుబడులకు రిలయెన్స్ గ్రీన్ సిగ్నల్



- సీఎం చంద్రబాబుతో భేటీలో కీలక నిర్ణయం
- సీఐఐ సదస్సులో రిలయెన్స్ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ
- రాష్ట్రంలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు రిలయెన్స్ అంగీకారం
- ఏఐ డేటా సెంటర్, సోలార్ ప్లాంట్, ఫుడ్ పార్క్ ఏర్పాటుకు ప్రకటన
- 1 గిగావాట్ సామర్థ్యంతో అత్యాధునిక ఏఐ డేటా సెంటర్ నిర్మాణం
- కర్నూలులో 170 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్
- వేలాది మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు

ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులు పెట్టేందుకు రిలయెన్స్ ఇండస్ట్రీస్ ముందుకొచ్చింది. విశాఖ నగరంలో సీఐఐ భాగస్వామ్య సదస్సు సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో రిలయెన్స్ ప్రతినిధులు సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం రాష్ట్రంలో - మిగతా 2 లో

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
శనివారం 15-11 - 2025

# మైనార్టీ సంక్షేమ వసతి గృహం, స్పెషల్ ఎస్టీ బాయ్స్ హాస్టల్ లను కలెక్టర్ ఆఖస్మిక తనిఖీ



**మహబూబాబాద్ జిల్లా తెలంగాణ సేన నవంబర్ 14:** గురువారం రాత్రి జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, మహబూబాబాద్ పట్టణం పత్తిపాక లోని ఆశ్రమ హై స్కూల్ బాయ్స్, కురవి రోడ్డు మైనార్టీ సంక్షేమ వసతి గృహం, స్పెషల్ ఎస్టీ బాయ్స్ హాస్టల్ లను కలెక్టర్ ఆఖస్మికంగా తనిఖీ చేసి, వసతి గృహం లోని స్టడీ రూమ్ కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, టాయిలెట్స్, పరిసరాలను పరిశీలించారు,స్టడీ అవర్ లో ఉన్న పిల్లలతో స్వయంగా మాట్లాడి అందిస్తున్న విద్యా బోధనలను అడిగి తెలుసుకున్నారు, ౦హబూబాబాద్ జిల్లా కేంద్రంలోనీ ఆశ్రమం పాఠశాల లో పిల్లలు, ఉపాధ్యాయుల హాజరు వివరాల పట్టికను, స్టోర్ గది, రిజిస్టర్ లను తనిఖీ చేశారు,వారికి నాణ్యమైన వేడి వేడి ఆహారాన్ని వడ్డించాలని, నైట్ మెనూ ప్రకారం పక్కాగా అమలుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు,ప్రతి సబ్జెక్టులో పిల్లలకు మెలుకువలు నేర్పుతూ వారి మేధస్సును వెలికితీయడానికి కృషి చేయాలనీ తెలిపారుప్రస్తుత శీతాకాలం నేపథ్యంలో వసతి గృహంలో పిల్లలకు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలని వారి ఆరోగ్య పరిస్థితిలను నిత్యం గమనిస్తూ ఉండాలని ఆదేశించారు ఈ కార్యక్రమంలో వార్డెన్ లక్ష్మీ నరసింహ ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ మాక్ డ్రిల్ సిరిసిల్ల మానేరు తీరంలో అవగాహన సదస్సు..







**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 14 (తెలంగాణ సేన) :** అవగాహనతోనే వరదలు, నీటి ముంపు నుంచి రక్షణ పొందవచ్చని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పేర్కొన్నారు. కమ్యూనిటీ అవేర్ నెస్ లో భాగంగా భారత ప్రభుత్వం, హోమ్ శాఖ ఆదేశాల మేరకు ఎన్డీఆర్ఎఫ్ బెటాలియన్, సిరిసిల్ల అగ్నిమాపక శాఖ ఆద్వర్యంలో సిరిసిల్ల పట్టణంలోని మానేరు తీరంలో మాక్ డ్రిల్ నిర్వహించగా, ముఖ్య అతిథిగా అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విహారయాత్ర లకు వెళ్లే పర్యాటకులు, సరదాగా నదీ తీరాల్లో విహరించే వారు, ఈత రాని వారు నీళ్ళల్లో మునిగి పోయినప్పుడు డ్రిల్ చూపించిన విధంగా చేస్తే ప్రాణాలు ఎలా కాపాడుకోవచ్చో వివరించారు. వరదలు సంభవించినప్పుడు, ఆకస్మాతుగా నీరు పట్టణాలు, గ్రామాల్లోకి వచ్చినప్పుడు అందుబాటులో ఉన్న ఖాళీ బాటిల్స్, క్యాన్స్, థెర్మాకోల్ షీట్స్, ప్లాస్టిక్ బిందెలు ఎండిన కొబ్బరి బొండాలు మొదలగునవి ఉపయోగించి నీటిలో తెలియాడే పద్దతులు తెలియజేశారు. నీటిలో మునిగి పోతున్న వ్యక్తి ని ఎలా లాక్కు రావాలి అని వివిధ పద్దతులలో చూపించారు. బయటకు తీసుకు వచ్చిన వ్యక్తికి సీ పీ ఆర్, కృత్రిమ శ్వాస ఎలా కల్పించాలి, నీరు ఎలా బయటికి రప్పించాలో ప్రాక్టికల్ గా చూపించారు.

# చిన్నారుల హక్కులకు డి ఎల్ ఎస్ ఎ ప్రత్యేక కృషి

## చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్






**తంగళ్ళపల్లి, నవంబర్ 14 (తెలంగాణ సేన) :** చిన్నారులకు సమాన హక్కులు కల్పించడం, వారికి అవసరమైన రక్షణ మరియు సహాయాన్ని చేరువ చేయడమే లక్ష్యంగా జిల్లా న్యాయ సేవాధికర సంస్థ నిరంతరం కృషి చేస్తోందని చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ టి. పర్శరాములు అన్నారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన తెలంగాణ గిరిజన సంక్షేమ అప్‌గ్రేడ్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో బాలల దినోత్సవంను పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికర సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పుష్పలత గారి ఆదేశాలతో సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శి, పి.లక్ష్మణాచారి సమన్వయంతో ఈ సదస్సును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పిల్లలు భారతదేశ భవిష్యత్తు అని, బాలల హక్కులు ప్రతి ఒక్కరు గౌరవించాలని అన్నారు..ఈ సదస్సులో.ఎస్.మల్లేష్ యాదవ్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, లోక్ అదాలత్ సభ్యులు/న్యాయవాదులు ఆడెపు వేణు, .గుర్రం ఆంజనేయులు, గిరిజన సంక్షేమ కళాశాల ప్రధానోపాధ్యాయురాలు . పి.రజని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# జమ్మికుంట గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ సంబురాలు.





**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి నవంబర్ 14 :** ఈరోజు జమ్మికుంట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా,జమ్మికుంట గాంధీ చౌరస్తాలో గెలుపు సంబరాలు.. టపాసులు కాల్చి, సీట్లు పంపిణీ చేసి, డీజే బాక్స్ లతో సంబరాలు నిర్వహించడం జరిగింది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గారు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మంత్రులకు, ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు, కార్పొరేషన్ చైర్మన్ లకు కాంగ్రెస్ పెద్దలందరికీ, అదే విధంగా హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు గారికి ముఖ్యంగా జూబ్లీహిల్స్ ప్రజలతో పాటు కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. ఈ రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో ప్రజలందరూ సుభిక్షంగా సంతోషంగా ఉన్న సందర్భంలో, బి.ఆర్.ఎస్ ఎన్ని అబద్ధపు ప్రచారాలు చేసిన - అవాస్తవాలు మాట్లాడిన వాటన్నింటిని లెక్కచేయకుండా అభివృద్ధి చేస్తున్న ప్రజాపాలనకు ప్రజలు పట్టం కట్టి, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించారు. రానున్న స్థానిక సంస్థలలో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్.ఎస్.యు.ఐ నాయకులు భారీ ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా తప్పదు...

## సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ




**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 14 (తెలంగాణ సేన) :** సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ఆదేశాల మేరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా 57 మంది మందు బాబులు పట్టుబడగా వారిని సిరిసిల్ల పట్టణ పోలీసులు శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టగా 57 మంది మందు బాబులకు జరిమానాలు విధిస్తు మేజిస్ట్రేట్ జయశ్రీ తీర్పు వెల్లడించినట్లు టౌన్ ఇన్స్పెక్టర్ కృష్ణ తెలిపారు.సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ లో డ్రంక్ అండ్ డ్రైవ్ లోపట్టుబడిన మందు బాబులకు పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, ట్రాఫిక్ ఎస్.ఐ దిలీప్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించి వారితో ఇంకెప్పుడు మద్యం సేవించి వాహనాలు నడపమని ప్రతిజ్ఞ చేపించారు.

# బీసీ రిజర్వేషన్ల బిల్లుల అమల్లో జరుగుచున్న జాప్యానికి నిరసనగా జేఏసీ బీసీల దీక్షలు





**వేములవాడ, నవంబర్ 14 (తెలంగాణ సేన) :** బీసీ రిజర్వేషన్ల అమల్లో మరింత జాప్యం చేస్తే,బీసీ ఉద్యమం ఉవ్వెత్తున ఉప్పెనలా ఎగసి పడుతుంది!రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్లో చేర్చితేనే బీసీలకు కల్పించిన 42 శాతం రిజర్వేషన్లకు రక్షణ లభిస్తుంది. బీసీ రిజర్వేషన్ల బిల్లుల అమల్లో జరుగుచున్న తీవ్ర జాప్యాన్ని నిరసిస్తూ,ఈ రోజు వేములవాడ పట్టణంలోని బీసీ సాధికారిత సంఘం కార్యాలయం ముందున రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ అర్.కృష్ణయ్య పిలుపు మేరకు భారతరత్న ,రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్,మహాత్మా జ్యోతిభా పులే గార్లకు ముందుగా పూలమాలలు వేసి,ఘనంగా నివాళులు అర్పించి ,ఉదయం 10.00 గంటల నుండి 2.00 గంటల వరకు బీసీల దర్మపోరాట దీక్షలను చేపట్టారు. దర్మపోరాట దీక్షల్లో పాల్గొన్న బీసీ సంఘాల రాష్ట్ర జేఏసీ కన్వీనర్ కొండ దేవయ్య మాట్లాడుతూ,తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు రాజ్యాంగ బద్దంగా,చట్టబద్ధంగా , శాస్త్రీయంగా అమలు చేయాలని,రిజర్వేషన్లు అమలయ్యాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని,పార్టీ పర రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు జరపాలన్న ఆలోచన విరమించుకోవాలని,కోర్టుల్లో న్యాయపోరాటం ,కేంద్రంలో రాజకీయ పోరాటం చేసి రిజర్వేషన్లను చట్టబద్ధంగా సాధించాలని కొండ దేవయ్య అన్నారు.ఉభయసభల్లో స్థానిక ఎన్నికలకు సంబంధించిన,విద్య, ఉపాధి , ఉద్యోగాలల్లో రిజర్వేషన్లకు చెందిన రెండు బీసీ బిల్లులు బిల్ నెంబర్ 3 మరియు బిల్ నెంబర్ 4 లను మార్చ్ 27 న అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన బిల్లులు సుమారు 8 మాసాలు గడుస్తున్నపటికి బిల్లులు ఆమోదించక పెండింగ్లో ఉంచడం చాల బాధాకరమని దేవయ్య అన్నారు.పొలాస నరేందర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా బీసీ సాధికారిత సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ,డిసెంబర్ 1 న ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల్లో ,రాష్ట్రానికి చెందిన ఇరుపార్టీల జాతీయ ఎంపీలు 16 మంది,ఇతర రాజ్యసభ సభ్యులు ఉభయసభల్లో ప్రశ్నించాలని,ఉభయ సభలను స్తంభింప జే యాలని,అవసరమైతే బీసీ జేఏసీ నేతలతో,అఖిలపక్షంతో ఢిల్లీని దిగ్బందించైన రిజర్వేషన్లను సాధించాలని నరేందర్ ఎంపీలకు విజ్ఞప్తి చేశారు.బీసీ రిజర్వేషన్ల పోరాటం ఏ వర్గానికి, ఏ పార్టీలకు, ఏ మతానికి వ్యతిరేకం కాదని,జనాభా దామాషా ప్రకారం బీసీ హక్కులకై,బీసీల వాటా - కోటా కొరకు,బీసీల ఆత్మ గౌరవం కొరకు చేస్తున్న పోరాటమని,రిజర్వేషన్లు సాధించేంత వరకు తెలంగాణ రాష్ట్ర సాధనలా జయశంకర్ సార్ స్ఫూర్తితో ఉద్యమము కొనసాగిస్తూనే ఉంటామనీ నరేందర్ అన్నారు.బీసీ రిజర్వేషన్ల సాధనకై నేడు చేపట్టిన బీసీల దర్మపోరాట దీక్షల్లో బీసీ సంఘాల నేతలు, జేఏసి నేతలు అఖిలపక్షం నేతలు తుపుకారి సత్తయ్య, ఇల్లందుల వెంకటేష్,రంగు రామాగౌడ్,నేరెళ్ళ అనిల్ గౌడ్,కూరగాయల మల్లేశం,కూరగాయల కొమురయ్య,మారం కుమార్,కొండ కనుకయ్య,లింగంపల్లి దేవయ్య,నేరెళ్ల నర్సయ్య,వాసం మల్లేష్ యాదవ్,ఉయ్యాల భూమయ్య గౌడ్,కనపర్తి సుధాకర్,జాప ప్రసంగి, చేను హేలపతి,బుర్ర దశ గౌడ్,ముద్రాకోల నర్సయ్య,గణేష్,నగేష్, లింబాద్రి,మ్యాణ రాజేష్,శ్రీధర్,కుంభం రవీందర్,కనపర్తి హన్మాన్లు,ఒన్నారపు దేవయ్య,దండ్ల జంపయ్య,రాజు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి...

## తల్లి పోషకాహారం తీసుకోవాలి

## ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్










**గంభీరావుపేట,నవంబర్ 14 (తెలంగాణ సేన) :** గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్వాడీ కేంద్రాలను వినియోగించుకోవాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు. గంభీరావుపేటలో రూ. 14 లక్షల నిధులతో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రారంభించారు.అంగన్వాడిల్లో చదివే విద్యార్థులకు కుట్టించిన యూనిఫాంలను, పోషకాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. ప్రతి చిన్నారికి సమీప అంగన్వాడీ కేంద్రాల్లో చదవాలని, కేంద్రాల్లో అందించే కోడి గుడ్లు, బాలామృతం, అన్నం ఇతర పోషకాహారాన్ని వారికి తినిపించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్న పిల్లలు ఆటల్లో, చదువులో రాణిస్తారని వివరించారు. పిల్లలు బడి బయట ఉండవద్దని, రోజూ అంగన్వాడీ కేంద్రాలకు రావాలని, చేతులు శుభ్రం చేసుకోవాలని, తినాలని, ఆడుకోవాలని సూచించారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి, అంగన్వాడిలో మూడు నెలలపాటు పోషకాహారం ఇవ్వాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు మునగ ఆకు, నువ్వులు, ఇతర కూరగాయలు, కోడి గుడ్లు, పాలు ఆహారంలో భాగం చేసుకుంటే మందులు అవసరం ఉండదని స్పష్టం చేశారు. ప్రతి ఇంట్లో మహిళలు పోషకాహారం తీసుకోవాలని, వారు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం అంతా బాగుంటుందని తెలిపారు.

**ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన**

గంభీరావుపేటలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ధాన్యం నిల్వలు పరిశీలించి, రైతులతో మాట్లాడారు. ఇప్పటిదాకా ఎన్ని క్వింటాళ్ల ధాన్యం రైస్ మిల్లులకు తరలించారో అధికారులతో ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, తహసీల్దార్ మారుతి రెడ్డి, ఎంపీడీఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి లక్ష్యం చేరాలి

## సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రభుత్వ ఆర్డర్లు అందిస్తాం

## మార్కెట్ కు అనుగుణంగా ముందుకు వెళ్లాలి

## అందరూ భీమా పథకాలలో చేరాలి





**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 14 (తెలంగాణ సేన) :** సిరిసిల్ల జిల్లా కేంద్రంలో యధావిధిగా చేనేత జౌళి శాఖ కార్యాలయం సేవలుఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ పై సమీక్ష సమావేశం మహిళా సంఘాల సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి యూనిఫాం చీరల క్లాత్ ఆర్డర్ లక్ష్యం చేరాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో చేనేత జౌళి శాఖ అధికారులు, వస్త్ర పరిశ్రమ కార్మికులు, ఆసాములు, యజమానులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఇందిరా మహిళా శక్తి యూనిఫాం చీరల క్లాత్ ఆర్డర్ కేటాయింపు, ఉత్పత్తిపై మాక్స్ సొసైటీలు వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన ఆర్డర్ ప్రకారం వస్త్ర పరిశ్రమ బాధ్యులు ఈ నెల 24 వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని ఆర్డర్లు అందిస్తామని స్పష్టం చేశారు. అలాగే పరిశ్రమ బాధ్యులు సైతం మార్కెట్ ఆర్డర్లు పొందేలా ముందుకు సాగాలని పేర్కొన్నారు. కార్మికుల విజ్ఞప్తి మేరకు ఐ డీ ఓ సీ లో ఉన్న చేనేత జౌళి శాఖ కార్యాలయం సిరిసిల్లలోని కార్యాలయానికి తరలిస్తామని తెలిపారు. వస్త్ర పరిశ్రమలోని వారందరూ నేతన్న భద్రత, నేతన్న భరోసా పథకాల్లో నమోదు కావాలని సూచించారు. అలాగే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష భీమా యోజనలో నమోదు కావాలని కోరారు. దీంతో వారి కుటుంబాలకు ఎంతో భరోసాగా ఉంటుందని, ఈ నెల 18, 19 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు పెట్టీ అర్హులందరిని చేర్పించాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కింద అమలు అవుతున్న పథకాల పూర్తి సమాచారం, సబ్సిడీ వివరాలతో కూడిన పంప్లేట్లు సిద్ధం చేసి, వస్త్ర పరిశ్రమ వారికి అందించాలని సూచించారు. ఆధునికత పై అవగాహన పెంచుకొని, నూతన పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని పేర్కొన్నారు. విద్యుత్, పాత బకాయిల విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఇంచార్జి కలెక్టర్ తెలిపారు. సమావేశంలో చేనేత జౌళి శాఖ ఏడీ రాఘవరావు, డీఆర్డీఓ శేషాద్రి, ఎల్డీఎం మల్లికార్జున రావు, అధికారులు, సిబ్బంది, వస్త్ర పరిశ్రమ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

## ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

## జీజీహెచ్ సిరిసిల్లపై సమీక్ష సమావేశం



**రాజన్న సిరిసిల్ల, నవంబర్ 14 (తెలంగాణ సేన) :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)పై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ రోజూ ఓపీ, అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వివిధ వార్డుల్లో రూఫ్ లీకేజీకి మరమ్మత్తు పనులు, పోస్ట్ ఆపరేటివ్ వార్డు ఆధునీకరణ, పెయింటింగ్, ఏసీ, మరుగుదొడ్ల మరమ్మత్తు, మెష్ డోర్స్ ఏర్పాటు, మెటర్నిటీ వార్డులోని ఓపీ వద్ద పెయింటింగ్, మెష్ డోర్స్ ఏర్పాటు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇంకా ఔట్ పేషెంట్ మేల్ వార్డు మందులు తీసుకునే వద్ద షెడ్ ఏర్పాటు, అదనంగా నల్లా కనెక్షన్లు, ఆక్సిజన్ స్టోరేజ్ గదిలో పలు అభివృద్ధి పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఆయా అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్ పోస్టులను భర్తీ చేయాలని సూచించారు.రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సభ్యత్వ నమోదు పెంచాలని, వైద్యులు, సిబ్బంది, ఆయా శాఖల అధికారులతో నమోదు చేయాలని సూచించారు. ఈ సమీక్షలో జీ జీ హెచ్ సూపరిండెంట్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేశ్వరి, డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ చికోటి సంతోష్ కుమార్, డీఎంహెచ్ఓ డాక్టర్ రజిత, డీసీ హెచ్ ఎస్ డాక్టర్ పెంచలయ్య, వైద్యులు ఆవాస్ గౌరీ, ఎం లక్ష్మీనారాయణ, సుగుణ ప్రసాద్, ఐఎంఏ ప్రెసిడెంట్ శోభారాణి, ఆర్ ఎం ఓ డాక్టర్ కపిల్ సాయి, లయన్స్ క్లబ్ బాధ్యులు నాగుల సంతోష్, రెడ్ క్రాస్ బాధ్యులు వేణు, టీజీఎంఎస్ఐడీసీ ఈఈ విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్ గెలుపు కాంగ్రెస్ అభివృద్ధికి మలుపు - ప్రణవ్

- జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ బంపర్ "వి"క్టరీ..
- సోమాజిగూడ డివిజన్ 288లో స్పష్టమైన ఆధిక్యం సాధించిన కాంగ్రెస్.
- సెంటిమెంట్ తో బిఆర్ఎస్ ఎన్ని రాజకీయాలు చేసినా జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారు.
- ఉప ఎన్నిక గెలుపు ద్వారా కాంగ్రెస్ లో నయా జోష్..



**తెలంగాణ సేన హుజురాబాద్ ప్రతినిధి నవంబర్ 14 :** జూబ్లిహిల్ ఎన్నికల్లో గెలవడం ద్వారా అభివృద్ధి విషయంలో కాంగ్రెస్(మాపై) మరింత బాధ్యత పెరిగిందని,రాష్ట్రంలో అభివృద్ధి కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని మరోసారి రుజువైందని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఒక ప్రకటనలో తెలిపారు.బిఆర్ఎస్ పార్టీ పదేళ్ల వైఫల్యాలను ఎండగడుతూ,రెండేళ్లలో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించామని,ఇలాంటి తీర్పు ద్వారా అభివృద్ధిలో మరింత ముందుకు వెళ్తామని అన్నారు.ఉప ఎన్నికల్లో రామగుండం శాసన సభ్యుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తో కలిసి ఎన్నికల్లో ప్రచారం చేసిన ప్రణవ్ సోమాజిగూడ 288 బూత్ లో మంచి మెజారిటీ సాధించారు,ఈ సందర్భంగా అక్కడి ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే బీసీల పట్ల చిత్తశుద్ధి ఉన్న పార్టీగా జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఒక బీసీ వర్గానికి చెందిన నవీన్ యాదవ్ ను నిలబెట్టడం ద్వారా బీసీలపై నిజమైన కమిట్మెంట్ కాంగ్రెస్ పార్టీకి ఉందని మరోసారి రుజువైందని అన్నారు.నూతనంగా ఎమ్మెల్యే గా ఎన్నికైన నవీన్ కుమార్ యాదవ్ కి హార్దిక శుభాకాంక్షలు తెలియజేస్తూ, హుజూరాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు.ప్రధాన కూడళ్లలో బాణాసంచా కాలుస్తూ,మిఠాయిలు తినిపించుకున్నారు.ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అబద్ధపు ప్రచారాలతో,సెంటిమెంట్ తో ఎన్ని రాజకీయాలు చేసినా జూబ్లిహిల్స్ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టారని అన్నారు.ఇదే జోష్ లో రాబోయే స్థానిక ఎన్నికల్లో కూడా అన్ని స్థానాలు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

## హక్కుల కోసం పోరాడె సంఘం కేజీ కేఎస్..

-గీత కార్మికులకు ఉచిత వైద్య సేవలు అందిస్తా

గ్యాస్ట్రోలజిస్ట్ వైద్యులు రాంపెల్లి విజయ్ గౌడ్



**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15,(తెలంగాణ సేన నవంబర్ 14 న్యూస్):** గీత కార్మికుల హక్కుల కోసం పోరాడేదె కల్లుగీత కార్మిక సంఘం అని ప్రముఖ గ్యాస్ట్రోలజిస్ట్ వైద్యనిపుణులు డాక్టర్ రాంపెల్లి విజయ్ గౌడ్ అన్నారు. శుక్రవారం కల్లుగీత కార్మిక సంఘం జిల్లా మూడో మహాసభ పట్టణంలోని కిరాణావర్తక ఫంక్షన్ హాల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యమ గాని వెంకన్న, గౌని వెంకన్న అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కేజీ కేఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎంవి రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు హాజరుకాగా గౌరవ అతిథిగా రాంపెల్లి విజయ గౌడ్ హాజరై మాట్లాడారు.కల్లుగీత కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభ విజయవంతం కావాలని ఈ సమావేశానికి హాజరైనందుకు ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు.కల్లు వృత్తి ఎంతో ప్రమాదకరమైనదని అయినా గీత కార్మికులు తమ ఉపాధి కోసం తాడి చెట్టు ఎక్కె క్రమంలో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. కల్లుగీత కార్మికుల కోసం ఉచిత వైద్యాన్ని అందిస్తానని మానుకోట జిల్లా కేంద్రంలోని తొర్రూర్ బస్టాండ్ లోని గణేష్ మెడికల్ షాప్ లో సంప్రదించి నా వైద్య సేవలు వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం నాయకులు, మండల అధ్యక్ష కార్యదర్శులు, గీత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉగ్రవాద దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



**ముధోల్:14నవంబర్(తెలంగాణ సేన న్యూస్) :** దేశ రాజధాని ఢిల్లీలో ఇటీవల జరిగిన ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన దేశ పౌరుల ఆత్మశాంతికి నిరసనగా నియోజకవర్గ బీసీ జేఏసీ కన్వీనర్ రోళ్ళ రమేష్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. మండల కేంద్రమైన ముధోల్ లోని స్థానిక గాంధీ చౌక్ వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులను ర్యాలీని చేపట్టి ఉగ్రవాదాన్ని అంతమందించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ఉగ్రవాద దాడిలో ప్రాణాలు కోల్పోయిన పౌరుల ఆత్మకు ప్రగాఢ సానుభూతిని తెలిపి మౌనం పాటించారు. దాడులు చేసిన ఉగ్రవాదులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి జెఎసి ఉపాధ్యక్షులు సాపేవార్ కిష్టయ్య, విడిసి అధ్యక్షులు విటల్, సభ్యులు వెంకటేష్, దశరథ్, కోరిపోతన్న, శ్రీనివాస్ గౌడ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు

## రబింద్ర పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం

-ఆకట్టుకున్న విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు







**ముధోల్,14నవంబర్(తెలంగాణ సేన న్యూస్) :** మండల కేంద్రమైన ముధోల్ లోని రబింద్ర పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చాచా నెహ్రు వేష ధారణలో వచ్చి ఒకరినొకరు చిల్డ్రన్స్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు ఉపన్యాసలు, వ్యాసరచన పోటీలలో పాల్గొని బహుమతులను అందుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం విద్యార్థులు ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించి రకరకాల రుచుల గల ఆహార పదార్థాలను తీసుకొచ్చి పాఠశాల ఆవరణలో ప్రదర్శించడంతో పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోషకులు వాటిని తమ సొంత డబ్బులతో కొనుగోలు చేసి కమ్మని రుచులను ఆనందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అసంవార్ సాయినాథ్ మాట్లాడుతూ భారత మొట్టమొదటి ప్రధానమంత్రి నెహ్రూ చిన్నపిల్లలను చాలా ఇష్టపడే వారని నవంబర్ 14న పుట్టినరోజును బాలల దినోత్సవంగా జరుపుకుంటారన్నారు. ఫుడ్ ఫెస్టివల్ లో ఎస్సై బిట్ల పెర్సిస్ పాల్గొని విద్యార్థులు తయారుచేసిన పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేందర్ , డైరెక్టర్ పోతన్న యాదవ్,భీమ్ రావు దేశాయ్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాగభూషణ విద్యాలయంలో చిల్డ్రన్స్ డే.. విద్యార్థుల అద్భుత ప్రదర్శన

ఆకట్టుకున్న జాతీయ నాయకుల వేషధారణలు






**బాసర, నవంబర్14 :తెలంగాణ సేన న్యూస్ :** బాసర మండల కేంద్రంలోని నాగభూషణ విద్యాలయంలో ఘనంగా చిల్డ్రన్స్ డే సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బాబురావు పటేల్ దేశం మొదటి ప్రధాన మంత్రి పండిత్ జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ప్రత్యేక నవంబర్ 14న చిల్డ్రన్స్ డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు విద్య బోధన చేశారు. ఉపాధ్యాయులుగా మారి విద్యా బోధన చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. చిన్నారుల ఆటపాటలు, నృత్య కార్యక్రమాలతో అద్భుత ప్రదర్శన నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శంకరన్న యాదిసభ కు తరలిరండి



**కొత్తగూడ తెలంగాణ సేన. :** గోదావరి లోయ ఉద్యమ సారధి కామ్రేడ్ శంకరన్న యాది సభను 16 11 2025 రోజున పాకాల కొత్తగూడ మండలం గాంధీనగర్లో శంకరన్న సహచర మిత్ర బృందం నిర్ణయిస్తున్న సభను జయప్రదం చేయడం కోసం శంకరన్న తో కలిసి ప్రయాణం చేసిన మిత్రులు సహచరులు పార్టీలకు అతీతంగా హాజరు కావాలని కోరుకుంటూ ప్రజాసంఘాలు విప్లవ సంఘాలు అందరూ పాల్గొనాలని వస్తారని మేము అభిప్రాయ పడుతున్నాం ఎందుకు అంటే కామ్రేడ్ శంకర్ అన్న విప్లవ పార్టీలు అన్ని ఒక్క ఏజెండాతో ఉన్నాము కనుక ఈ దోపిడీ సమాజం మారాలంటే మార్క్సిజం లిమినిజం మావో ఆలోచన విధానం అధ్యయనం చేసి ఒకే కమ్యూనిస్టు పార్టీగా పనిచేయాలని కోరుకున్న నాయకుడు ఆ నినాదాన్ని బలంగా నమ్మిన గోదావరి లోయ సారధి శంకరన్న ఆ శయం కోసం అమరుడు అయినట్టి కామ్రేడ్ శంకరన్నను స్మరించుకుందాం.

## కాంట్రాక్టర్ రైల్వే అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ ఘాతంతో కూలి మృతి



**తెలంగాణ సేన నవంబర్ 14 ( బాసర ప్రతినిధి ) :** నిర్మల్ జిల్లా :- బాసర దక్షిణ భారత రైల్వే నాందేడ్ నుండి నిజామాబాద్ వరకు డబుల్ లైన్ కరెంటు పనులు జరుగుతున్న నేపథ్యంలో శు క్రవారం కాంట్రాక్టర్ అధికారుల నిర్లక్ష్యంతో పనుల చేపడుతున్న సదరు కూలీ పనిచేస్తుండగా ఓ వ్యక్తి విద్యుత్ ఘాతంతో మృతి చెందారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన ధర్మ తాలూకా బాలపురం గ్రామానికి చెందిన కొందరు కూలీలు రైల్వే నూతన అభివృద్ధి పనుల కోసం జరుగుతున్న పనులలో భాగంగా, నిత్యం కూలి పనిగా చేయగా శుక్రవారం బాసర రైల్వే స్టేషన్ గోదావరి వంతెన మార్గమధ్యన ఆకస్మాత్తుగా పనిచేస్తుండగా, ఇనుప చువ్వా కరెంటు తీగలకు తగలడంతో కరెంట్ షాక్ తో గంగాధర్ (30) అనే వ్యక్తి అక్కడక్కడ మృతి చెందారు. ఈ నేపథ్యంలో సదరు సబ్ కాంట్రాక్టర్ మల్లికార్జున పోస్టుమార్టం నిమిత్తం ఎవరిని అనుమతులు తీసుకోకుండా బైంసా ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ కుటుంబ సభ్యులు భీష్మించి మాకు న్యాయం జరిగే వరకూ ఇక్కడ నుంచి కదలమంటూ నిరసనలు తెలిపారు. మృతునికి భార్య సీమా, శృతి, శ్రేయ, శ్రేష్ట,మహి,సుకాశిని, సమీక్ష,ఆరుగురు కూతుళ్లు ఉన్నారు రెక్కడితే డొక్కాడని కుటుంబం గంగాధర్ ఒకరిపైనే కుటుంబ సభ్యులు ఆధారపడి ఉండేవారు నిత్యం కూలినాలి పనులు చేసి కుటుంబ భారాన్ని మోసుకొస్తున్న వారు చనిపోవడంతో గ్రామంలో అందరూ బంధువులతో పాటు కన్నీరు మున్నీరు పెట్టుకొని శోకసముద్రంలో మునిగారు ఈ సందర్భంగా సదరు కాంట్రాక్టర్ తో పాటు అధికారులను చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు

## ములుగు నవీన్ నాగరాణి దంపతులను సన్మానించిన మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి



**తెలంగాణసేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో వైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వనభోజన మహోత్సవంలో పాల్గొన్న ములుగు మండల ఆర్యవైశ్య నాయకులు, ములుగు మండల ఆర్యవైశ్య నాయకులు నవీన్ నాగరాణి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆర్యవైశ్య సీనియర్ నాయకులు జూలూరు రంగయ్య తో కలిసి నాగరాణి నవీన్ దంపతులను సన్మానించిన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవీన్ నాగరాణి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా వారిని శాలువాతో సత్కరించి వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని అలాగే వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్తీక వనభోజన మహోత్సవంలో పాల్గొన్న అందరికీ అమ్మవారి దీవెనలు ఉంటాయని అన్నారు ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు జూలూరి రంగయ్య,నాగరాజు, మధు,మహిళలు స్వాతి,ప్రియాంక, ఇందిర , లక్ష్మీ,నాగరాణి ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ అక్షర పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం




**ముధోల్:నవంబర్ 14: తెలంగాణ సేన న్యూస్. :** ముధోల్ :మండలం లోని శ్రీ అక్షర పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు నెహ్రూ వేషధారణలో అలాగే అనేక మంది విద్యార్థులు చక్కటి సాంప్రదాయ దుస్తులు రావడంతో పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొంది. పాఠశాలలోని తరగతి గదులను విద్యార్థులు ఒకరోజు ముందుగానే చక్కగా అలంకరించారు. అలాగే పాఠశాల ఆవరణలో విద్యార్థులు చాచా నెహ్రూ పట్ల చక్కటి ఉపన్యాసాలను ఇస్తూ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పలువురు విద్యార్థులు చక్కటి పాటలతో అందరిని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని రాబోయే రోజుల్లో చాచా నెహ్రూ యొక్క ఆశయాలను నెరవేర్చాలని పేర్కొన్నారు. చాచా నేర్పు పిల్లలు అంటే చాలా ఇష్టమని అందుకే అందుకే ఈరోజు చాచా నెహ్రు పుట్టినరోజు సందర్భంగా బాలల దినోత్సవం నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, ముఖ్యంగా మొబైల్ ఫోన్లకు, టీవీలకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ వహించి దేశానికే మంచి పేరు తెచ్చి పెట్టాలని అన్నారు. అనంతరం చక్కటి ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునిలు తదితరులు పాల్గొన్నారు.

## శిశు మందిర్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్




**ముధోల్:14నవంబర్(తెలంగాణ సేన న్యూస్):** ముధోల్: మండల కేంద్రమైన శ్రీ సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం పురస్కరించుకొని ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో రుచికరమైన వంటకాలను ఇంటి నుండి విద్యార్థులు తీసుకొచ్చి ఫుడ్ ఫెస్టివల్ లో ప్రదర్శించారు. వంట పేరు దాని తయారీకి ఉపయోగించిన వంటకాల విధానాలను చక్కగా వివరించారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపల్ సారథి రాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాన గుణం, సేవ గుణం త్యాగ గుణాలు పెంపొందుతాయని అన్నారు అనంతరం పాఠశాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమం లో శ్రీ సరస్వతీ విద్యాపీఠం నిర్మల్ జిల్లా ఉపాధ్యక్షులు ధర్మపురి సుదర్శన్, పాఠశాల అధ్యక్షులు కొండావార్ సంజీవ్ , ఉపాధ్యక్షులు రోళ్ళ రమేష్, కార్యదర్శి వేదపాఠక్ నిశికాంత్ , సభ్యులు కంది దత్తాత్రి,కోరి పోతన్న,కంది మానాజీ ,అకాడమిక్ ఇంచార్జీ స్వప్న శర్మ ఆచార్యులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ముధోల్ లో కాంగ్రెస్ పార్టీ సంబురాలు



**ముధోల్:నవంబర్ 14:తెలంగాణ సేన న్యూస్. :** హైదరాబాద్ లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో గెలుపొందడంతో నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రావుల గంగారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. స్థానిక బస్టాండ్ చౌరస్తాలో టపాకాయలు పేలిచారు. ఆనంతరం స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రావుల గంగారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కాంగ్రెస్ పార్టీని జూబ్లీహిల్స్ లో భారీ మెజారిటీతో గెలిపించాయని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తోనే తెలంగాణ మరింత అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రేంనాథ్ రేడ్డి, కిషన్ పతంగి, కిషన్ పటేల్,రావుల శ్రీనివాస్,దిగంబర్,అజిజ్, నగేష్, నజీమ్,సందూరు యాదవ్ , ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా మోహన్ రావు పటేల్



**తానూర్, నవంబర్14 :తెలంగాణ సేన న్యూస్:** తానూర్ మండలంలోని నంద్ గాం గ్రామంలో మాన్కూర్ భూమా బాయి అనే నిరుపేద మహిళకు చెందిన ఇల్లు ఇటీవల షాట్ సర్క్యూట్ తో పూర్తిగా కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న మోహన్ రావు ప్రజా ట్రస్ట్ చైర్మన్ భోస్లే మోహన్ రావు పటేల్ శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. కష్టకాలంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా బాధితురాలికి రూ.10 వేల నగదు, నిత్యావసర సరుకులు తక్షణ సహాయంగా అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

## బాసర విద్యార్థుల విజయం

రాష్ట్రస్థాయి యోగ పోటీలకు ఎంపికైన నాగభూషణ పాఠశాల విద్యార్థులు



**బాసర, నవంబర్ 14. తెలంగాణ సేన న్యూస్ :** ఇచ్చోడా బోరిగాం లో ఇటీవలి రోజుల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 69వ జోనల్ స్థాయి యోగ పోటీలలో బాసరలోని నాగభూషణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో మెరిసిన ఈ విద్యార్థులు రాష్ట్రస్థాయికి అర్హత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బాబురావు జారికొటే తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. అండర్%-%17 బాలుర విభాగంలో రిథమిక పేర్ ఈవెంట్లో డి. అవినాష్, జి. మనీష్ గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్%-%14 బాలుర విభాగంలో రిథమిక్ పేర్ కేటగిరీలోఎం. చరణ్, ఎస్. రితేష్ గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత పొందారు. అదే విభాగంలో రజిత పథకాలు సాధించిన విద్యార్థులు: ఎం. చంద్ర తేజ్, వేదాంత, యువరాజ్, బి. సాయి, చె. అవంతి. రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు యోగ కోచ్ మల్లేష్ వెల్లడించారు.

# నేటి బాలలే రేపటి పౌరులు..

మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగు..




**డోర్నకల్ తెలంగాణ సేన ప్రతినిధి :**-నేటి బాలలే రేపటి పౌరులని మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగు అన్నారు.మన దేశ మొట్టమొదటి ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూ దేశానికి ఎక్కువ కాలం ప్రధానిగా సేవలు అందించారని అన్నారు.బ్రిటిష్ పాలనలో చితికిలపడ్డ దేశాన్ని తనదైన దార్శనికత,ముందుచూపుతో పురోగతి దిశగా నడిపించారని 1889 నవంబర్ 14న పుట్టిన నెహ్రూకు పిల్లలన్నా,గులాబీలన్నా అమితమైన ప్రేమ అని అన్నారు.అందుకే భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటారని అన్నారు. నెహ్రు ఎక్కడికెళ్లినా.. పిల్లలను వెతికి మరీ ఆప్యాయంగా పలకరించేవారు.వారికి కానుకలను ఇచ్చి ఉత్సాహపరిచేవారు.ప్రధాని కాకముందు స్వతంత్ర పోరాటంలో భాగంగా ఆయన పలుమార్లు జైలు జీవితం అనుభవించారు.పిల్లలంటే ఎంతో ఇష్టమైన నెహ్రూకు తన కుమార్తె ఇందిర అంటే ఎనలేని అభిమానం.అందుకే ఆయన జైలు గోడల మధ్య నుంచి ఆమెకు అనేక ఉత్తరాలు రాసేవారు.స్వతహాగా రచయిత అయిన నెహ్రూ తన కుమార్తెకు రాసిన ఉత్తరాల్లో బోలెడు మంచి సంగతులు చెప్పేవారు. పిల్లలు ఎలా ఉండాలి..? ఎలాంటి విషయాలు నేర్చుకోవాలి..? సమాజంలో మంచి,చెడులను ఎలా గ్రహించాలి..? సమస్యలను ఎలా అధిగమించాలి, తదితర అంశాలను కూలంకషంగా వివరించేవారు.నెహ్రూ నింపిన ఉత్సాహం, ధైర్యంతోనే ఇందిర 'ఉక్కు మహిళ'గా రూపొందారని,ప్రధానిగా సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకొని దేశాన్ని ముందుకు నడిపారు.తన కుమార్తె ఇందిరకు నెహ్రు రాసిన ఉత్తరాలు నేటి తరానికి పాఠాలయ్యాయి.ఆయన చెప్పిన ఆ మంచి మాటలు మనం ఎప్పటికీ ఆచరించదగినవే అని అన్నారు. పిల్లలకు కూడా పండిట్ నెహ్రూ అంటే వల్లమానిన ప్రేమ. ఆయన్ని ముద్దుగా 'చాచా నెహ్రూ', 'చాచాజీ' అని పిలుచుకుంటారు.1964లో నెహ్రూ మరణించిన తర్వాత ఆయన పుట్టిన రోజును 'బాలల దినోత్సవం'గా నిర్వహించాలని భారత ప్రభుత్వం నిర్ణయించిందని అందుకే నాటి నుంచి నవంబర్ 14 ను బాలల దినోత్సవంగా జరుపుకొంటున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు రజిత, సుధా,ఇందిరా, శోభ, సరిత,సునీత,సుమిత్ర, విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# మోడల్ వర్సిటీలుగా జేఎన్‌టీయూహెచ్, ఓయూ!

**రెండింటికి రూ.200 కోట్లు**

**అన్ని విశ్వవిద్యాలయాల చుట్టూ ప్రహరీ ఉండాలి**

**ప్రతి హాస్టల్‌లో వెల్‌నెస్ సెంటర్ తప్పనిసరి**

**'తెలంగాణ విద్యా విధానం'పై సిఫార్సు చేయనున్న మౌలిక వసతుల కోర్ గ్రూప్**



'రాష్ట్రంలో మొదటి విడతగా జేఎన్‌టీయూహెచ్, ఉస్మానియాలను మోడల్ వర్సిటీలుగా తీర్చిదిద్దాలి. మౌలిక వసతుల కోసం మూడేళ్లలో ఈ రెండు వర్సిటీలకు ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించాలి' అని విద్యాసంస్థల్లో మౌలిక వసతులపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కోర్ గ్రూప్ సిఫార్సు చేయనుంది. జాతీయ విద్యా విధానం తరహాలో తెలంగాణకూ ప్రత్యేకంగా సలహాదారు కె.కేశవరావు ఛైర్మన్‌గా కమిటీని నియమించిన సంగతి తెలిసిందే.విద్యారంగంలో సంస్కరణలే ప్రధాన లక్ష్యంగా ఈ కమిటీ అధ్యయనం చేసి, అక్టోబరులోపు నివేదిక అందించాలని ఆదేశించింది. 2024 జులైలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో సంస్కరణలకు మంత్రి శ్రీధర్‌బాబు ఛైర్మన్‌గా, మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్‌లు సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. ఆ కమిటీ సైతం జాతీయ విద్యా విధానం - 2020లో ఏ అంశాలను అమలు చేయవచ్చో వివరిస్తూ నివేదిక ఇవ్వాలని గతేడాదే అధికారులను ఆదేశించింది. తాజాగా ఆ నివేదిక ప్రకటించింది.

***11 కోర్ గ్రూప్‌లను నియమించిన ప్రభుత్వం :*** నివేదికల రూపకల్పనకు 11 కోర్ గ్రూప్‌లను సర్కారు నియమించింది. మౌలిక వసతులు, డిజిటల్ టెక్నాలజీ, పరిశోధన, సిలబస్ తదితర అంశాలపై పలుమార్లు సమావేశమైన కోర్ గ్రూప్‌లు, ఈ వారంలోగా నివేదికలను కమిటీ ఛైర్మన్‌కు అందజేయనున్నారు. తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి నేతృత్వంలోని మౌలిక వసతుల గ్రూప్ పలు ఆసక్తికర సిఫార్సులను చేయనున్నట్లు తెలిసింది.

***అవి ఏంటంటే :***

విద్య, మౌలిక వసతులు, పరిశోధన, నవకల్పన అంశాల్లో ఎక్స్‌లెన్స్ సాధించేందుకు జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను చేరుకునేందుకు ఎంపిక చేసిన వాటిని మోడల్ వర్సిటీలుగా అభివృద్ధి చేయాలి.తొలి విడతలో జేఎన్‌టీయూహెచ్, ఓయూలను ప్రాధాన్యంగా తీసుకోవాలి. మూడేళ్లలో ఒక్కో వర్సిటీకి విశ్వవి ద్యాలయ మౌలిక వసతుల ఆధునికీకరణ నిధి కింద రూ.200 కోట్ల చొప్పున ఇవ్వాలి. కేంబ్రిడ్జి, స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల మాదిరిగానే అంతర్జాతీయ స్థాయిలో ఆ రెండు ప్రాంగణాలను రీడిజైన్ చేయాలి.మోడల్ వర్సిటీల్లో విదేశీ విద్యార్థులకు ప్రత్యేకంగా వసతి గృహాలతో పాటు కౌన్సెలింగ్ విభాగాలను నెలకొల్పాలి. అంతర్జాతీయ నిపుణులతో సమన్వయం చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో ఉన్నతస్థాయి సలహా కమిటీని నియమించాలి. ఆ కమిటీ యూకే, థాయ్‌లాండ్, సింగపూర్‌లలో విభిన్నమైన డిజైన్లు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు తెలుసుకొని అమలు చేసేందుకు ఆయా దేశాల్లో పర్యటించాలి. కేంద్రీయ వర్సిటల మాదిరిగా అన్ని ప్రభుత్వ విశ్వవి ద్యాలయాల చుట్టూ ప్రహరీ నిర్మించాలి. ప్రతి వర్సిటీలో ఉపకులపతి ఛైర్మన్‌గా మౌలిక వసతుల అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేసుకోవాలి.ప్రతి పెద్ద విద్యా సంస్థలో ఉద్యోగుల పిల్లల కోసం ఛైల్డ్ కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి.

***అన్నింటినీ హరిత ప్రాంగణాలుగా తీర్చిదిద్దాలి.***

విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం పెంపొందించేందుకు ప్రతి హాస్టల్‌లో వెల్‌నెస్ రూమ్ తప్పనిసరి చేయాలి. బాస్కెట్‌బాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్ లాంటివి ఆడుకునేందుకు అవకాశం కల్పించాలి.యూజీ, పీజీ కళాశాలలు పట్టణ ప్రాంతాల్లో మూడు ఎకరాలు, గ్రామీణ ప్రాంతాల్లో 5 ఎకరాల విస్తీర్ణంలో ఉండాలి.పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలలకు ప్రతి 1,500 మంది విద్యార్థులకు 3-4 ఎకరాలు, గ్రామీణ ప్రాంతాల్లో 4-5 ఎకరాల స్థలం ఉండాలి. ప్రతి పాఠశాలలో విద్యార్థుల కోసం కంప్యూటర్, ఏఐ, నైపుణ్య, టింకరింగ్, ప్రాక్టికల్ ల్యాబ్‌లు ఉండాలి. డిజిటల్ గ్రంథాలయాలు తప్పనిసరి ఏర్పాటు చేయాలి.

# ఇక నుంచి వారానికి రెండుసార్లు ప్రైవేటు బస్సుల తనిఖీలు

**రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు**

**తనిఖీలను ముమ్మరం చేసిన రవాణాశాఖ**

**ప్రమాదాల నివారణకు రవాణాశాఖ కొత్త కార్యాచరణ**



ఈ మధ్యకాలంలో రోడ్డు ప్రమాదాలు విపరీతంగా పెరిగిపోయాయి. దీనికి కారణం వాహనదారుల మితిమీరిన వేగంతో పాటు గడువు తీరిన వాహనాలను ఉపయోగించడమే. ఇలాంటి వాటితో పాపం అభాగ్యులు ప్రాణాలు కోల్పోతున్నారు. గత నెలలో జరిగిన కర్నూలు బస్సు ప్రమాదంతో పాటు రంగారెడ్డి జిల్లాలో టిప్పర్ ఢీకొట్టి ఆర్టీసీ బస్సు ప్రమాదం అందరినీ కలచి వేసింది. ఇలాంటి ప్రమాదాలు తగ్గించడం, రహదారి భద్రత పెంచడం వంటివి లక్ష్యంగా చేసుకొని రవాణాశాఖ కొత్తగా కార్యాచరణను రూపొందించింది.రాష్ట్రవ్యాప్తంగా బుధ, గురువారాల్లో 1,050 వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు రవాణాశాఖ తెలిపింది. అలాగే 750 వాహనాలను సీజ్ చేసినట్లు స్పష్టం చేసింది. హైదరాబాద్ - బెంగళూరు ప్రైవేటు బస్సు కర్నూలు జిల్లాలో దగ్ధమవడం, చేవెళ్లలో ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టిన ఘటనల నేపథ్యంలో అంతర్రాష్ట్ర ప్రైవేటు వాహనాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించింది. ఈ క్రమంలో రాష్ట్రంలో ప్రతిరోజూ ప్రైవేటు బస్సులను రవాణాశాఖ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. వాటిలో సేఫ్టీ కిట్స్ ఉన్నాయా లేదా బస్సు సర్వీసింగ్‌లోనే ఉందా వంటి విషయాలను గుర్తిస్తున్నారు.ఓవర్‌లోడ్‌తో వెళ్లినా, ఎక్కువ చలాన్లు ఉన్న గూడ్సు వాహనాలు, కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సులను సీజ్ చేయాలని రవాణాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 13 అంశాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాచరణ ప్రణాళికను కమిషనర్ ఇలంబర్తి హైదరాబాద్ జేటీసీకి, అన్ని జిల్లాల డీటీసీలకు పంపించారు. అక్రమ రవాణా, ఓవర్‌లోడింగ్, ఫిట్‌నెస్ గడువు ముగిసినా తిరిగే వాహనాలను, అనుమతి లేకుండా సీట్లు మార్చిన బస్సులను స్వాధీనం చేసుకోవాలని రవాణాశాఖ తాజాగా నిర్ణయించింది.

***వారంలో ఒకసారి ఆకస్మిక తనిఖీలు :*** అంతర్రాష్ట్ర ప్రైవేటు బస్సులను వారంలో కనీసం రెండుసార్లు తనిఖీ చేయాలని హైదరాబాద్ జేటీసీతో పాటు రంగారెడ్డి, నల్గొండ, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, సంగారెడ్డి జిల్లాల డీటీసీలను ఆదేశించింది. వారం రోజుల తనిఖీల నివేదికల్ని ప్రతి సోమవారం జేటీసీకి పంపాలని స్పష్టంగా చెప్పింది. అలాగే వారంలో ఒకసారి ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని రవాణాశాఖ నిర్ణయం తీసుకుంది.

***చేయాల్సిన తనిఖీలు, తీసుకోవాల్సిన చర్యలు :***

ప్రతి ఉమ్మడి జిల్లా పరిధిలో కనీసం రెండు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేయాలి.

ప్రతి బృందంలో ఒక మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ), ఇద్దరు అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్లు (ఏఎంవీఐలు) ఉండాలి.

అలాగే పబ్లిక్ హాలిడేలు సహా రోజూ రహదారులపై వాహనాలను పర్యవేక్షించాలి.

ఫిట్‌నెస్ సర్టిఫికేట్ లేకుండా నడుస్తున్న వాహనాల్లో హెవీ, మీడియం, ప్రయాణికుల, విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేయాలి.

గూడ్సు వాహనాలు పరిమితికి మించిన బరువుతో వెళ్లకుండా నిరోధించాలి.

కాంట్రాక్ట్ క్యారేజ్ బస్సుల్లో బ్యాటరీలు, అగ్నిప్రమాదాలకు కారణమయ్యే వస్తువులు తీసుకెళ్లకుండా నిషేధించాలి.

వాహనంలో అనుమతి లేని మార్పులు, ఓపెన్ బాడీ వాహనాలను టిప్పర్లుగా మార్చితే చర్యలు తీసుకోవాలి.

నేషనల్, స్టేట్ హైవేల్లో రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపకుండా నివారించాలి.

ఆటోల్లో డ్రైవర్ పక్కన లేదా వెనుక లగేజీ బాక్స్‌లో ప్రయాణికులు ఉండకుండా చూసుకోవాలి.

బయలుదేరే ప్రాంతాల్లోనే ఓవర్ లోడింగ్‌ను అరికట్టేందుకు మైనింగ్ శాఖతో సంప్రదించి తగిన చర్యలు తీసుకోవాలి.

సరైన సర్టిఫికెట్‌లు లేకుండా చట్టవిరుద్ధంగా నడుస్తున్న వాహనాలపైనా కేసులు నమోదు చేయాలి.

# కర్నూలు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు జాక్‌పాట్

**రూ.65 లక్షల ప్యాకేజీతో కొలువులు**

**కర్నూలు ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు భారీ ప్యాకేజీలతో ఉద్యోగాలు**

**ప్రకాశం జిల్లా విద్యార్థికి రూ.65 లక్షల వేతనంతో కొలువు**

**జేఈఈ ఫెయిలైనా పట్టువదలని యువకుడికి రూ.65 లక్షల జాబ్**

**యూపీ విద్యార్థినికి మైక్రోసాఫ్ట్‌లో రూ.53 లక్షల ఉద్యోగం**

**సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి సత్తా చాటిన విద్యార్థులు**

**కోడింగ్, ప్రాజెక్టులపై పట్టు సాధించడమే విజయ రహస్యం**




ఏపీలోని కర్నూలు ట్రిపుల్ ఐటీ (ఐఐఐటీడీఎం) విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. సాధారణ, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులు లక్షల రూపాయల వార్షిక వేతనాలతో ప్రతిష్ఠాత్మక కంపెనీలలో ఉద్యోగాలు సాధించి అందరికీ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఏకంగా రూ.65 లక్షలు, రూ.53 లక్షల వార్షిక ప్యాకేజీలతో ప్రముఖ కంపెనీల నుంచి ఆఫర్లు అందుకున్నారు. పట్టుదల, కఠోర శ్రమ ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని వారు నిరూపించారు.

***రైతు బిడ్డకు రూ.65 లక్షల జాబ్***

ప్రకాశం జిల్లా పెద్దఅరవీడు మండలానికి చెందిన ఏరువ మహేశ్ రెడ్డి బెంగళూరుకు చెందిన సూపర్‌మనీ కంపెనీలో రూ.65 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించాడు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన మహేశ్, తన చదువు కోసం తల్లిదండ్రులు శివారెడ్డి, రమణమ్మ ఎంతో కష్టపడ్డారని తెలిపాడు. జేఈఈ మెయిన్స్‌లో మంచి ర్యాంకు సాధించి కర్నూలు ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో సీటు సంపాదించాడు. కోర్సు సమయంలో సీ, సీ++ వంటి కోడింగ్ లాంగ్వేజీలపై పట్టు సాధించి, పలు ప్రాజెక్టులు చేశానని చెప్పాడు. ఇంటర్వ్యూ సమయంలో ఈ ప్రాజెక్టుల అనుభవంతో పాటు, అదనంగా నేర్చుకున్న నైపుణ్యాలు తనకు ఎంతగానో ఉపయోగపడ్డాయని వివరించాడు.

***వైఫల్యం నుంచి విజయానికి..***

ఝార్ఖండ్‌కు చెందిన నితీశ్ కుమార్ కథ ఎందరికో స్ఫూర్తిదాయకం. వడ్రంగి పనిచేసే తండ్రి కొడుకైన నితీశ్, మొదటిసారి జేఈఈలో ర్యాంకు సాధించలేకపోయాడు. అయినా నిరాశపడకుండా, ఏడాదిపాటు మళ్లీ కష్టపడి చదివి రెండో ప్రయత్నంలో మంచి ర్యాంకుతో కర్నూలు ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించాడు. కోర్సు సమయంలో అనేక హ్యాకథాన్లు, పోటీల్లో పాల్గొన్నానని, ఆ అనుభవమే ఇంటర్వ్యూలో విజయం సాధించడానికి దోహదపడిందని అన్నాడు. నితీశ్ కూడా సూపర్‌మనీ కంపెనీలోనే రూ.65 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం దక్కించుకున్నాడు.

***మైక్రోసాఫ్ట్‌లో ఉద్యోగం***

ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శ్రేయాపాండే టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్‌లో రూ.53 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం సాధించింది. ఈ విజయం వెనుక తన తల్లి శశిపాండే ప్రోత్సాహం ఎంతో ఉందని శ్రేయా పేర్కొంది. జేఈఈ మెయిన్‌లో మంచి ర్యాంకుతో ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ సైన్స్ సీటు సంపాదించింది. చదువుతుండగానే మైక్రోసాఫ్ట్‌లో ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం లభించిందని, ఆ తర్వాత అదే కంపెనీలో ఉద్యోగం సాధించానని ఆమె వివరించింది. కేవలం సిలబస్‌కే పరిమితం కాకుండా ప్రత్యేక నైపుణ్యాలు పెంచుకోవడం వల్లే ఈ విద్యార్థులు ఇంతటి ఘనవిజయం సాధించి తోటివారికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

# జూబ్లీహిల్స్ కౌంటింగ్ వేళ విషాదం

**గుండెపోటుతో ఇండిపెండెంట్ అభ్యర్థి మృతి**

**ఫలితాల ఉత్కంఠతో అభ్యర్థి మహమ్మద్ అన్వర్ గుండెపోటుతో మృతి**

**ఆసుపత్రికి తరలించినప్పటికీ దక్కని ఫలితం**

**యూసఫ్‌గూడ స్టేడియంలో కొనసాగుతున్న ఓట్ల లెక్కింపు**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కౌంటింగ్ ఉత్కంఠ నడుమ తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఫలితాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థుల్లో ఒకరైన మహమ్మద్ అన్వర్ (40) గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించారు.వివరాల్లోకి వెళితే, ఎర్రగడ్డలో నివాసముంటున్న అన్వర్ ఉదయం నుంచి జరుగుతున్న కౌంటింగ్ ప్రక్రియను ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ క్రమంలో ఆయన తీవ్రమైన ఛాతీ నొప్పితో కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించినప్పటికీ, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఎన్నికల ఫలితాలపై తీవ్ర ఒత్తిడి, ఆందోళనే ఆయన మరణానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. అన్వర్ ఆకస్మిక మరణంతో ఆయన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రాజకీయ వర్గాలు సైతం సంతాపం వ్యక్తం చేస్తున్నాయి.ఈ విషాద ఘటన ఓ వైపు ఆవేదన కలిగిస్తుండగా, మరోవైపు యూసఫ్‌గూడలోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి స్టేడియంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతోంది. భారీ భద్రతా ఏర్పాట్ల మధ్య కౌంటింగ్ జరుగుతోంది. మొత్తం 10 రౌండ్లలో, 42 టేబుళ్లపై ఓట్లను లెక్కిస్తున్నారు. పారదర్శకత కోసం ప్రతి టేబుల్ వద్ద ఒక సీసీ కెమెరాను ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియలో 186 మంది సిబ్బంది పాల్గొంటున్నారు.

## కౌంటింగ్ హాల్ నుంచి వెళ్లిపోయిన బీజేపీ అభ్యర్థి దీపక్ రెడ్డి

**తీవ్ర నిరాశలో బీజేపీ శ్రేణులు**



బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి ఫలితాల సరళిని గమనించి, ఏడో రౌండ్ కౌంటింగ్ జరుగుతుండగానే కేంద్రం నుంచి బయటకు వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది.ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం ప్రారంభమైనప్పటి నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. అయితే, రౌండ్లు గడిచేకొద్దీ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ క్రమంగా తన ఆధిక్యాన్ని పెంచుకున్నారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి మూడో స్థానంలో కొనసాగుతున్నారు. ఫలితాల సరళి స్పష్టంగా కనిపిస్తుండటంతో, దీపక్ రెడ్డి కౌంటింగ్ మధ్యలోనే అక్కడి నుంచి వెళ్లిపోయారు.అక్కడి నుంచి వెళుతున్న సమయంలో అక్కడున్న మీడియాతో ఆయన మాట్లాడుతూ... బీజేపీ పార్టీ ఎన్నికల్లో డబ్బు పంచదని అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విచ్చలవిడిగా డబ్బులు, మద్యం పంచాయని ఆరోపించారు.ద

## 'పాస్‌పోర్ట్' పాస్‌లతో మహేశ్-రాజమౌళి మూవీ ఈవెంట్

**సోషల్ మీడియాలో వైరల్!**

**మహేశ్-రాజమౌళి మూవీ ఈవెంట్ కోసం ప్రత్యేక పాస్‌లు**

**అచ్చం పాస్‌పోర్ట్‌ను పోలినట్టుగా క్రియేటివ్ డిజైన్**

**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న పాస్‌పోర్ట్ పాస్‌లు**

**ఈవెంట్‌కు పాస్‌లు ఉన్నవారికే అనుమతి అని రాజమౌళి స్పష్టీకరణ**

**రేపు రామోజీ ఫిల్మ్ సిటీలో గ్రాండ్ ఈవెంట్**




సూపర్ స్టార్ మహేశ్ బాబు, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న పాన్-వరల్డ్ ప్రాజెక్ట్ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మహేశ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాకు సంబంధించిన కీలక అప్‌డేట్స్ కోసం రేపు రామోజీ ఫిల్మ్ సిటీలో భారీ ఈవెంట్ నిర్వహించనున్నారు. అయితే, ఈ ఈవెంట్ కన్నా ముందే అందుకోసం రూపొందించిన పాస్‌లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.ఈవెంట్‌కు హాజరయ్యే అభిమానుల కోసం చిత్రబృందం 'పాస్‌పోర్ట్ స్టైల్'లో ప్రత్యేక పాస్‌లను తయారు చేసింది. పసుపు రంగు అట్టతో, దానిపై GLOBETROTTER EVENT,PASSPORT అని ముద్రించి ఉన్నాయి. ప్రీలుక్‌లో మహేశ్ మెడలో కనిపించిన త్రిశూలం లోగోను కూడా ఈ పాస్‌పై డిజైన్ చేశారు. లోపల మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్, రాజమౌళి ఫొటోలతో పాటు ఈవెంట్ గైడ్‌లైన్స్, మ్యాప్ వంటి వివరాలను పొందుపరిచారు. అచ్చం అసలు పాస్‌పోర్ట్‌లా కనిపించడం దీని ప్రత్యేకత.ఈ క్రియేటివ్ ఐడియా చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. కేవలం సృజనాత్మకతే కాకుండా దీని వెనుక పక్కా మార్కెటింగ్ వ్యూహం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. సినిమా వర్కింగ్ టైటిల్ 'గ్లోబ్‌ట్రాటర్'కు తగ్గట్టుగా పాస్‌పోర్ట్ థీమ్‌ను ఎంచుకోవడం ఆసక్తిని పెంచుతోంది.ఇదే సమయంలో ఈ పాస్‌లపై వస్తున్న ప్రచారానికి దర్శకుడు రాజమౌళి స్వయంగా స్పష్టతనిచ్చారు. పాస్‌లు ఉన్న వారిని మాత్రమే ఈవెంట్‌కు అనుమతిస్తామని, సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని అభిమానులను కోరుతూ ఓ వీడియో విడుదల చేశారు. ఇక ఈ చిత్రంలో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ 'కుంభ' అనే పాత్రలో, ప్రియాంక చోప్రా 'మందాకిని'గా కనిపించనున్నారని తెలుస్తోంది.ఇటీవల విడుదలైన 'సంచారీ' పాట ఇప్పటికే సోషల్ మీడియాలో రికార్డులు సృష్టిస్తోంది. శ్రుతి హాసన్ ఆలపించిన ఈ గీతం ట్రెండింగ్‌లో నిలుస్తూ సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది.

## క్లాస్ రూమ్ లో తాలిబన్ రూల్స్

**ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ బాగోతం!**

**ఎర్రకోట పేలుళ్ల కేసులో అల్ ఫలా యూనివర్సిటీపై దర్యాప్తు**

**ఘటన తర్వాత వర్సిటీలో భయాందోళనలు.. ఆసుపత్రికి తగ్గిన రోగులు**

**అరెస్ట్ అయిన మరో డాక్టర్ షాహీన్ బాగా చెప్పేవారని విద్యార్థుల వెల్లడి**

**'డాక్టర్ల టెర్రర్ మాడ్యూల్'పై లోతుగా విచారణ జరుపుతున్న ఏజెన్సీలు**




ఢిల్లీలోని ఎర్రకోట వద్ద కారు బాంబు పేల్చి ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ మహమ్మద్, గతంలో తాను పనిచేసిన యూనివర్సిటీలో 'తాలిబన్ తరహా' కఠిన నిబంధనలు అమలు చేసేవాడని విద్యార్థులు వెల్లడించారు. ఈ ఉగ్రకుట్రతో సంబంధమున్న ఇద్దరు డాక్టర్లు పనిచేసిన ఫరీదాబాద్‌లోని అల్ ఫలా యూనివర్సిటీలో ఇండియా టుడే స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ చేపట్టిన స్టింగ్ ఆపరేషన్‌లో ఈ సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి.నవంబర్ 10న జరిగిన ఐ20 కారు పేలుడులో ఆత్మాహుతి బాంబర్‌గా ఉన్న డాక్టర్ ఉమర్ మహమ్మద్, మరో నిందితుడు డాక్టర్ ముజమ్మిల్ సయీద్ గతంలో ఈ యూనివర్సిటీలోనే అధ్యాపకులుగా పనిచేశారు. వారి గురించి ఇండియా టుడే ప్రతినిధులు విద్యార్థులు, సిబ్బందిని రహస్యంగా పలకరించగా కీలక విషయాలు తెలిసాయి."ఉమర్ సార్ మాకు పాఠాలు చెప్పేవారు. మా బ్యాచ్‌లో అబ్బాయిలు, అమ్మాయిలు కలిసే కూర్చునేవాళ్ళం. కానీ, ఆయన క్లాసుకు రాగానే మమ్మల్ని వేరువేరుగా కూర్చోబెట్టేవారు" అని ఓ ఎంబీబీఎస్ విద్యార్థి తెలిపారు. ఉమర్ ఎప్పుడూ ఒంటరిగా, ఎవరితో కలవకుండా ఉండేవాడని సిబ్బంది పేర్కొన్నారు. ఆయన క్యాంపస్‌లోని హాస్టల్‌లోనే నివసించేవారని విద్యార్థులు గుర్తుచేసుకున్నారు.అయితే, ఇదే కేసులో అరెస్టయిన మరో అధ్యాపకురాలు డాక్టర్ షహీన్ సయీద్ మాత్రం చాలా బాగా పాఠాలు చెప్పేవారని విద్యార్థులు గుర్తుచేసుకున్నారు.

## నోటి క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అలవాట్లు ఇవే..

# ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వద్దు సుమా



ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకీ క్యాన్సర్ బాధితుల సంఖ్య పెరుగుతోంది. క్యాన్సర్ లో అనేక రకాలున్నాయి. వాటిల్లో ఒకటి నోటి క్యాన్సర్. ఇది చాలా ప్రమాదకరమైన వ్యాధి. నోటి క్యాన్సర్ కారణంగా.. పెదవులు, నాలుక, బుగ్గలు, గొంతు కణజాలాలు ప్రభావితమవుతాయి. నోటి క్యాన్సర్ పొగాకుతో పాటు..అనేక ఇతర కారణాల వల్ల కూడా వస్తుందని మీకు తెలుసా? అవును నోటి క్యాన్సర్ ప్రమాదం పెరగడానికి గల కారణాలు ఏమిటి? దాని లక్షణాలు ఏమిటో ఈ రోజు తెలుసుకుందాం.. నోటి క్యాన్సర్ ని ఓరల్ క్యాన్సర్ అని కూడా పిలుస్తారు. పెదవులు, నాలుక, చిగుళ్ళు, బుగ్గల లోపలి భాగం, అంగిలి, గొంతు కణజాలాన్ని ప్రభావితం చేసే తీవ్రమైన వ్యాధి. పొగాకు, సిగరెట్లు దీనికి ప్రధాన కారణాలుగా పరిగణించబడుతున్నాయి. అయితే ఈ వ్యాధి బారిన తక్కువ శ్రద్ధ పెట్టే అనేక ఇతర కారణాలు కూడా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నోటి క్యాన్సర్ ధూమపానంతో పాటు, అనారోగ్యకరమైన జీవనశైలి కూడా కారణమవుతుంది. ఈ రోజు ఏ అలవాట్లు నోటి క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి? దీనిని ఎలా గుర్తించాలో తెలుసుకుందాం..

### నోటి క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే 5 అలవాట్లు:

**పొగాకు, ధూమపానం:** పొగాకు నమలడం, గుట్కా, పాన్ మసాలా, సిగరెట్లు కాల్చడం నోటి క్యాన్సర్‌కు అతిపెద్ద కారణాలు. పొగాకులో ఉండే నికోటిన్, క్యాన్సర్ కారక అంశాలు నోటి కణజాలాలను దెబ్బతీస్తాయి. దీనివల్ల క్యాన్సర్ కణాలు అభివృద్ధి చెందుతాయి.

**మద్యం సేవించడం:** ఆల్కహాల్ నోటి క్యాన్సర్ ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. ఆల్కహాల్, పొగాకు రెండింటినీ ఉపయోగించేవారికి ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది.

**అనారోగ్యకరమైన ఆహారం, పోషక లోపాలు:** పండ్లు, కూరగాయలు తక్కువగా తినడం వల్ల శరీరంలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు లోపానికి దారితీస్తాయి. ఎందుకంటే పండ్లు, కూరగాయలు తినడం వలన కణాలను దెబ్బతినకుండా కాపాడతాయి. వీటిని తినక పోవడం వలన శరీరంలో విటమిన్లు లోపం ఏర్పడి.. నోటి క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతాయి.

**నోటి పరిశుభ్రత నిర్లక్ష్యం:** దంతాలు, నోటిని సరిగ్గా శుభ్రం చేసుకోకపోవడం వల్ల బ్యాక్టీరియా పెరిగి ఇన్ఫెక్షన్ వ్యాపిస్తుంది. ఇది దీర్ఘకాలంలో నోటి క్యాన్సర్‌కు దారితీస్తుంది.

**ఇన్ఫెక్షన్:** కొన్ని రకాల వైరస్ నోటి క్యాన్సర్‌కు కారణమవుతుంది. ఈ వైరస్ అసురక్షిత శారీరక కలయిక లేదా ఈ వైరస్ సోకిన వ్యక్తితో కలయిక ద్వారా వ్యాపిస్తుంది.

### నోటి క్యాన్సర్ లక్షణాలు ఏమిటి?

నోటిలో లేదా పెదవులపై దీర్ఘకాలికంగా ఉండి నయం కాని పుండు లేదా గడ్డ

నోరు లేదా గొంతులో నిరంతర నొప్పి.

గొంతు లేదా నోటిలో తెలుపు లేదా ఎరుపు దద్దుర్లు.

మింగడానికి లేదా నమలడానికి ఇబ్బంది.

స్వరంలో మార్పు లేదా నిరంతర గొంతు నొప్పి.

నోటి నుంచి రక్తస్రావం లేదా దంతాలు వదులు అవ్వడం

మెడ లేదా దవడలో వాపు.

నోటి క్యాన్సర్ ప్రమాద నివారణకు ఏమి చేయాలంటే

పొగాకు, ధూమపానానికి పూర్తిగా దూరంగా ఉండాలి.

మద్యం అస్సలు తాగవద్దు. కొద్ది మోతాదులో తాగడం కూడా ఆరోగ్యానికి హానికరం.

సమతుల్య ఆహారం తీసుకోవాలి. ఇందులో పండ్లు, ఆకుపచ్చ కూరగాయలనుచేర్చుకోవాలి

క్రమం తప్పకుండా దంత పరీక్షలు చేయించుకోవాలి. నోటి పరిశుభ్రతను జాగ్రత్తగా చూసుకోవాలి.


వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా ఇన్ఫెక్షన్ ను నివారించండి.


## చిన్నగా ఉందనుకోకండి.. వర్షకాలంలో బోడకాకరతో బోలెడు లాభాలు!











బోడ కాకరకాయ తెలియని వారు ఎవరుంటారు చెప్పండి. వీటితో కర్రీ వండితే ఉండే టేస్ట్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అయితే బోడ కాకర కర్రీతో రుచి మాత్రమే కాదండోయ్, అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంట. కాగా, వర్షాకాలంలో బోడకాకర కాయ తినడం వలన ఎలాంటి లాభాలు ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.

బోడ కాకర కాయను కూరగాయల్లోనే కింగ్ అంటారు. ఎందుకంటే చికెన్, మటన్‌లో లభించనన్ని పోషకాలు ఇందులో లభిస్తాయి. అందుకే చాలా మంది బోడ కాకర కాయ తినాలని చెబుతుంటారు. మరీ ముఖ్యంగా వర్షకాలంలో ఇవి ఎక్కువగా లభిస్తుంటాయి. అయితే ఈ సీజన్‌లో బోడ కాకర తినడం వలన వైరల్ ఇన్ఫెక్షన్స్ దరి చేరవంట. ఇందులో అన్నిరకాల విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. అందుకే ప్రతి ఒక్కరూ ఈ కాకరను మీ డైట్‌లో చేర్చుకోవాలని చెబుతుంటారు.

బోడ కాకరలో శరీరానికి కావాల్సిన అనేక పోషకాలు లభిస్తాయి. విటమిన్స్,అమైనో ఆమ్లాలు, ఫ్లేవనాయిడ్స్, పోటాషియం, ఫాస్పరస్, ఇవన్నీ ఉంటాయి. అందుకే వర్షకాలంలో తప్పకుండా వీటిని తినాలంటారు. అదే విధంగా డయాబెటీస్ ఉన్న వారు వర్షాకాలంలో బోడ కాకర కాయను తినడం వల ఇది రక్తంలోని చక్కర స్థాయిలను నియంత్రిస్తుందంట. ఇందులో గ్లైసెమిక్ ఎక్కువగా ఉండటం వలన ఇది డయాబెటీస్ రోగులకు చాలా మేలు చేస్తుందంట.

అదేవిధంగా బోడకాకరలో విటమిన్ సీ పుష్కలంగా ఉంటుంది. అలాగే ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్, ఫాస్పరస్ వంటివి ఎక్కువ మోతాదులో ఉంటాయి. అందు వలన బోడ కాకరను తినడం వలన క్యాన్సర్ వంటి సమస్యలు దరి చేరవంట. అంతే కాకుండా ఇది రక్త పోటు ప్రమాదాన్ని తగ్గించి, గుండె సమస్యలు రాకుండా చేస్తుందంట.

అలాగే బోడ కాకరలో విటమిన్ సి, కాల్షియం పుష్కలంగా ఉంటుంది. అందువలన ఇది ఎముకల బలానికి చాలా మంచిది. అలాగే దీనిని వర్షాకాలంలో తినడం వలన వైరల్ ఇన్ఫెక్షన్స్, జలుబు, దగ్గు , వైరల్ ఫీవర్స్ నుంచి రక్షణ కలిపిస్తుందంట. అంతే కాకుండా బోడ కాకరలో ఎక్కువ మోతాదులో పొటాషియం ఉండటం వలన ఇది రక్తపోటు సమస్యతో బాధపడే వారికి మంచి ఔషధం అంటున్నారు ఆరోగ్య నిపుణులు.

బరువు తగ్గాలి అనుకునే వారికి కూడా బోడ కాకర చాలా మంచిదంట. దీనిని ప్రతి రోజూ తినడం వలన ఇది బరువును నియంత్రిస్తుందంట. ఎందుకంటే? బోడ కాకరలో అధిక మొత్తంలో ఫైబర్ ఉంటుంది. అందువలన దీనిని ప్రతి తీరోజూ తీసుకుంటే, ఇది కడుపు నిండిన భావన కలిగి అధిక ఆకలిని నియంత్రిస్తుంది. జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది.

## ఇవి ట్యాబ్లెట్స్ కాదు.. ప్రాణాలు తీసే కిల్లర్స్..

# చీటీకిమాటికి వేసుకుంటే ఇక అంతే

ఆరోగ్య నిపుణులు మందులను ఎక్కువగా, వైద్యులను సంప్రదించకుండా వాడమని ఎవరూ సిఫారసు చేయరు. కానీ ఇప్పటికీ ప్రజలు స్వీట్లలా నొప్పి నివారణ మందులను తీసుకుంటున్నారు. అయితే ఇది మీ కాలేయాన్ని దెబ్బతీస్తుందని.. క్రమంగా శరీరం మొత్తం ప్రభావితం అవుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్నిసార్లు శరీరంలోని ఏ భాగంలోనైనా నొప్పి రావడం సాధారణం.. కొంత సమయం తర్వాత అది దానంతట అదే నయమవుతుంది. ఎందుకంటే ఈ నొప్పి సాధారణంగా తప్పుడు నిద్ర భంగిమ, ఆహారపు అలవాట్లు, జీవనశైలి అలవాట్లు, ఒత్తిడి వంటి వాటి వల్ల వస్తుంది. కానీ నేటి కాలంలో ప్రజలు తలనొప్పి, ఋతు నొప్పి లేదా చిన్న శరీర నొప్పి వచ్చినప్పుడు వెంటనే మందుల దుకాణం నుంచి నొప్పి నివారణ (పెయిన్ కిల్లర్ ట్యాబ్లెట్స్) మందులు కొని వెంటనే వేసుకుంటారు.. కానీ ఈ అలవాటు క్రమంగా మీ కాలేయాన్ని దెబ్బతీస్తుందని మీకు తెలుసా..? అవును పెయిన్ కిల్లర్స్.. ప్రాణాలు తీసే కిల్లర్స్ అని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాస్కులర్ సర్జన్ వెరికోస్ వెయిన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ సుమిత్ కపాడియా తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో పెయిన్ కిల్లర్స్ ప్రమాదం గురించి హెచ్చరించారు. నొప్పి నివారణ మాత్ర క్రమంగా అలవాటుగా మారినప్పుడు, కాలేయం దానికి మూల్యం చెల్లించాల్సి ఉంటుందని నిపుణులు అంటున్నారు. కానీ మీ కాలేయం పూర్తిగా దెబ్బతినే వరకు ఎలాంటి హెచ్చరికలు ఇవ్వదు.. అది ఆగిపోయే వరకు నిశ్శబ్దంగా పనిచేస్తుంది. అటువంటి పరిస్థితిలో, నొప్పి నివారణ మందులు మీ కాలేయాన్ని నెమ్మదిగా ఎలా దెబ్బతీస్తాయో, అది కూడా ఎటువంటి లక్షణాలు లేకుండా.. ఎలా హాని తలపెడతాయి.. అనే విషయాలను తెలుసుకోండి..

### కాలేయానికి సైలెంట్ కిల్లర్ 'పెయిన్ కిల్లర్ మాత్రలు'.. ఎందుకంటే..

మీరు సూచించిన మోతాదు కంటే కొంచెం ఎక్కువ మందు తీసుకుంటే.. అది కాలేయానికి చాలా హానికరం. ముఖ్యంగా పారాసెటమాల్ అధిక మోతాదు మీ కాలేయానికి ప్రమాదకరం. క్రమం తప్పకుండా నొప్పి నివారణ మందులు తీసుకోవడం వల్ల కాలేయ ఎంజైమ్‌లు పెరిగే ప్రమాదం పెరుగుతుంది. దీనివల్ల లక్షణాలు లేకపోయినా కాలేయం దెబ్బతింటుంది. ఇబుప్రోఫెన్ వంటి లు కాలేయ వాపును పెంచుతాయి.. కొవ్వు కాలేయాన్ని (ఫ్యాటీ లివర్) మరింత దిగజార్చుతాయి.. దీని ఫలితంగా కాలేయ వైఫల్యం, మార్పిడి జరగవచ్చు. ఆల్కహాల్ తాగిన తర్వాత పెయిన్ కిల్లర్ (నొప్పి నివారిణి) తీసుకుంటే, ఇది సాధారణంగా హ్యాంగోవర్ వల్ల వచ్చే తలనొప్పికి ఉపయోగించబడుతుంది. ఇది మీకు రిలాక్స్‌గా అనిపించవచ్చు కానీ



ఇది కాలేయానికి విషపూరిత కలయిక..

వైద్యుడి సలహా లేకుండా ఎక్కువ కాలం మందు తీసుకుంటే, కాలేయం శాశ్వతంగా దెబ్బతింటుంది.


మందులు కాలేయానికి హాని కలిగించకుండా ఉండాలంటే ఏమి చేయాలి?

నిజంగా అవసరమైనప్పుడు మాత్రమే ఔషధం తీసుకోండి

సూచించిన మొత్తం కంటే ఎక్కువ మోతాదును ఎప్పుడూ తీసుకోకండి

పదే పదే తీసుకుంటుంటే వైద్యుడిని సంప్రదించండి.

## ముఖం లేదా చెట్టు ఈ చిత్రంలోమీరు చూసిందే మీ వ్యక్తిత్వం..



ఆప్టికల్ ఇల్యూషన్ చిత్రాలు మెదడుకు పని కల్పించే, తెలివితేటలను పరీక్షించే సరదా ఆట మాత్రమే కాదు. మన వ్యక్తిత్వాన్ని వెల్లడించే ఒక రకమైన వ్యక్తిత్వ పరీక్ష కూడా. ఆప్టికల్ ఇల్యూషన్ పర్సనాలిటీ టెస్ట్‌కు సంబంధించిన అనేక చిత్రాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఒక చిత్రం ఇక్కడ ఉంది. ఈ చిత్రంలో మీరు ముఖం లేదా చెట్టును చూస్తున్నారో దాని ఆధారంగా మీరు భావోద్వేగానికి లోనయ్యే వ్యక్తి కాదా అనేది తెలుసుకోండి.. సంఖ్యాశాస్త్రం, జ్యోతిష్యం మాత్రమే కాదు ఆప్టికల్ ఇల్యూషన్ పిక్చర్స్, సాముద్రిక శాస్త్రం, ముక్కు ఆకారం, పాదాల ఆకారం, శరీర ఆకారం వంటి వివిధ వ్యక్తిత్వ పరీక్షలు కూడా మనిషి జీవితాన్ని, రహస్య వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవడానికి మీకు సహాయపడతాయి. మీరు కూడా అలాంటి వ్యక్తిత్వ పరీక్షల ద్వారా అంతర్ముఖత్వం, బహిర్ముఖత్వం, కోపం, ప్రశాంతత మొదలైన మీ రహస్య లక్షణాలను తెలుసుకోవచ్చు. అదేవిధంగా నేటి వ్యక్తిత్వ పరీక్షలో భాగంగా వైరల్ అవుతున్న ఆప్టికల్ ఇల్యూషన్ పిక్చర్ ఆధారం మీరు ఎటువంటి వారో తెలుసుకోవచ్చు. ఇందులో చెట్టు లేదా ముఖం ఆధారంగా మీరు సహజమైన వ్యక్తినా లేదా భావోద్వేగ వ్యక్తినా అనేది తెలుసుకోండి.. ఈ చిత్రం మీ గురించి మీకు తెలియజేస్తుంది వైరల్‌గా మారిన ఈ ప్రత్యేకమైన ఆప్టికల్ ఇల్యూషన్ ఫోటోలో రెండు అంశాలు ఉన్నాయి. అందులో ఒక చెట్టు, ఒకటి మనిషి ముఖం. మీరు ఈ చిత్రంలో మొదట దేనిని చూస్తారో అదే మీ వ్యక్త్విత్వం.. అంటే మీరు మొదట చూసిన చిత్రం ద్వారా మీరు తార్కిక వ్యక్తినా లేదా భావోద్వేగ వ్యక్తినా అనేది తెలియజేస్తుంది.

**చెట్టు:** ఈ చిత్రంలో మీరు మొదట చెట్టును చూసినట్లయితే.. మీరు ప్రతి చిన్న విషయంపైన శ్రద్ధ చూపే వ్యక్తి. అంతేకాదు మీరు వాస్తవంలో జీవించే తార్కిక వ్యక్తి అని అర్థం. మీరు భావోద్వేగాల కంటే వాస్తవాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తారు. ఈ మనస్తత్వం సాంకేతిక, విశ్లేషణాత్మక, ఆచరణాత్మక వాతావరణాలలో బాగా పనిచేయడానికి మీకు సహాయపడుతుంది. వీరు అన్ని విషయాలలో సత్యానికి విలువ ఇస్తారు. మీరు చెప్పే హేతుబద్ధమైన సలహా కారణంగా ఇతరుల దృష్టిలో నమ్మదగిన వ్యక్తిగా కనిపిస్తారు.

**ముఖం:** ఈ ప్రత్యేకమైన ఆప్టికల్ భ్రమ చిత్రంలో మీరు మొదట ఒక ముఖాన్ని చూస్తే.. మీరు భావోద్వేగ వ్యక్తి అని అర్థం. వీరు ఇతరుల భావాలకు విలువ ఇస్తారు. వీరు సమస్యలను ఎలా పరిష్కరిస్తారో, ఆలోచనలను ఎలా కమ్యూనికేట్ చేస్తారో లేదా ఇతరులను ఎలా అర్థం చేసుకుంటారో అనే విషయంపై సృజనాత్మకత ప్రధాన పాత్ర పోషిస్తుంది. వీరు ఇతరులను ప్రేమిస్తారు. సానుభూతితో అర్థం చేసుకుంటారు. ఇతరుల భావాలకు విలువ ఇస్తారు. వీరు చాలా సున్నితమైన మనస్కులు.

## హైదరాబాదీలకు గుడ్ న్యూస్..

# నైట్ సఫారీ మళ్లీ షురూ!



హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ సందర్శకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమైంది. కేంద్ర జూ అథారిటీ అఫ్ ఇండియా జూలలో నైట్ సఫారీ (రాత్రి పూట సఫారీ)పై గతంలో విధించిన నిషేధాన్ని ఎత్తివేయడంతో, హైదరాబాద్ జూలో కూడా దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్ ఇంకా ప్రాథమిక దశలో ఉన్నప్పటికీ, త్వరలోనే ఇది అందుబాటులోకి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ సందర్శకులకు ఒక కొత్త అనుభవాన్ని అందించబోతోంది. కేంద్ర జూ అథారిటీ అఫ్ ఇండియా జూలలో నైట్ సఫారీ (రాత్రి పూట సఫారీ) పై నిషేధాన్ని ఎత్తివేయడంతో, హైదరాబాద్ జూలో కూడా దీన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ఇంకా ప్రాథమిక దశలో ఉంది, కానీ త్వరలోనే ఇది అందుబాటులోకి వస్తుందని అంచనా వేస్తున్నారు.

### వివరాలివే..

**ప్రారంభం:** ఈ నైట్ సఫారీ వచ్చే ఏడాదిలోగా అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు. సమయం: రాత్రి 6:00 గంటల నుండి రాత్రి 11:00 గంటల **వరకు ప్రత్యేకత:** రాత్రిపూట చురుకుగా ఉండే జంతువులను (నిశాచర జాతులు) ఈ సఫారీలో చూడవచ్చు.

### నెహ్రూ జూ పార్క్ గురించి

హైదరాబాద్‌లోని బహదూర్‌పురా దగ్గర మిర్ ఆలం ట్యాంక్ పక్కన నెహ్రూ జూ పార్క్ ఉంది. దీనిని 1963 అక్టోబర్ 6న ప్రారంభించారు. దీని నిర్మాణం 1959 అక్టోబర్ 26న మొదలై నాలుగు సంవత్సరాలు పట్టింది. ఈ జూ పార్క్ 200 సంవత్సరాల క్రితం 24 తోరణాలతో నిర్మించిన మిర్ ఆలం ట్యాంక్ బండ్ పక్కన ఉంది.

### ఏమేం ఉన్నాయంటే..

హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో మొత్తం 2,240 జంతువులు నివసిస్తున్నాయి. వీటిలో 55 జాతులకు చెందిన 664 క్షీరదాలు, 97 జాతుల నుండి 1,227 పక్షులు, 38 జాతుల 341 సరీసృపాలు, 2 జాతులకు చెందిన 8 ఉభయచరాలు ఉన్నాయి. ఈ జూ సహజ వాతావరణం నివాస, వలస పక్షులను కూడా ఆకర్షిస్తుంది. నైట్ సఫారీ ప్రారంభం జంతుప్రేమికులకు, సందర్శకులకు ఒక ప్రత్యేక అనుభూతిని అందిస్తుందని ఆశిస్తున్నారు.

# డయాబెటిస్‌కు క్యారెట్లు



నారింజ రంగులో ఉండే క్యారెట్లను వండుకోవడమే కాదు, పచ్చివిగానే కరకరా నమిలేస్తాం. వీటివల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయనేది తెలిసిన విషయమే. అయితే, క్యారెట్లు మధుమేహానికి మందుగా కూడా పనికిరావచ్చు అంటున్నది ఓ తాజా అధ్యయనం. యూనివర్సిటీ ఆఫ్ సదరన్ డెన్మార్క్‌కు చెందిన పరిశోధకులు ఈ అధ్యయనం జరిపారు. క్యారెట్లలో ఉండే ఓ రెండు పదార్థాలు పొట్టలో ఉండే బ్యాక్టీరియాను పెంపొందించడంలో కీలకంగా వ్యవహరిస్తాయని వాళ్లు కనుగొన్నారు. క్యారెట్లు రక్తంలో చక్కెర స్థాయిలను క్రమబద్ధీకరించడంలో దోహదపడతాయని వెల్లడించారు. జంతువులు, ఎలుకల మీద ఈ అధ్యయనం నిర్వహించారు. ఇందులో క్యారెట్లు తిన్నవాటి పొట్టలో మంచి బ్యాక్టీరియా పెరిగిందని తేలింది. మనుషుల మీద ఇంకా అధ్యయనం నిర్వహించాల్సి ఉంది. ముందుముందు మధుమేహానికి క్యారెట్లు ఖర్చులేని చికిత్సగా పనికిరావచ్చని వాళ్లు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# సంగీత ప్రియులకు గుడ్‌న్యూస్.. ఇక వాట్సాప్ స్టేటస్‌లో స్పాటిఫై మ్యూజిక్..!




ప్రియులకు గుడ్‌న్యూస్. మీకు ఇష్టమైన పాటలు, ఆల్బమ్, పాడ్‌కాస్ట్‌లను నేరుగా వాట్సాప్ స్టేటస్‌కు షేర్ చేసుకునే వీలుంటుంది. ఇందుకోసం వాట్సాప్ సరికొత్త ఫీచర్‌పై పని చేస్తుంది. స్పాటిఫై నుంచి మాత్రమే ఈ పాటలను నేరుగా షేర్ చేసుకునే వీలుంటుంది. సంగీత ప్రియులకు గుడ్‌న్యూస్. మీకు ఇష్టమైన పాటలు, ఆల్బమ్, పాడ్‌కాస్ట్‌లను నేరుగా వాట్సాప్ స్టేటస్‌కు షేర్ చేసుకునే వీలుంటుంది. ఇందుకోసం వాట్సాప్ సరికొత్త ఫీచర్‌పై పని చేస్తుంది. స్పాటిఫై నుంచి మాత్రమే ఈ పాటలను నేరుగా షేర్ చేసుకునే వీలుంటుంది. ఇప్పటి వరకు ఫొటోలు, వీడియోలు మాత్రమే స్టేటస్‌గా పెట్టుకునే అవకాశం ఉండగా.. ఇకపై స్టేటస్‌లో పాటలు సైతం షేర్ చేసుకోవచ్చు. ప్రతి పాట, ఆల్బమ్, పాడ్‌కాస్ట్‌లో కొత్త షేర్ బటన్ ఉంటుందని స్పాటిఫైవెల్లడించింది. ఈ బటన్‌ని ట్యాప్ చేయడం వల్ల వాట్సాప్‌తో సహా మల్టిపుల్ షేరింగ్ ఆప్షన్స్ ఉంటాయని చెప్పింది. కేవలం ఒకే ట్యాప్‌తో మీకు ఇష్టమైన ట్రాక్‌ను నేరుగా వాట్సాప్‌కు జోడించవచ్చని చెప్పింది. ఈ ఫీచర్‌ని క్రమంగా అందుబాటులోకి తీసువస్తుంది. ప్రస్తుతం మొబైల్స్‌లో ఈ బటన్ కనిపిస్తుంది.ఎవరికైనా కనిపించకపోతే త్వరలోనే అందుబాటులోకి వస్తుందని పేర్కొంది. ఈ ఫీచర్ కేవలం మ్యూజిక్‌కు మాత్రమే పరిమితం కాకుండా స్టేటస్‌లో ఇష్టమైన పాడ్‌కాస్ట్, ఆడియో బుక్, స్పాటిఫై షోను సైతం షేర్ చేయొచ్చు. ఇది మీ ఫ్రెండ్స్, కుటుంబీకులు స్పాటిఫై యాప్‌లో మీ స్టేటస్‌ని నేరుగా పాటలు, పాడ్‌కాస్ట్‌ను వినేందుకు అనుమతి ఇస్తుంది. ఇకపై య్పాటిఫై ప్రతి పాట, షో కింద షేర్ బటన్ ఇస్తుంది. దానిపై ప్రెస్ చేసి వాట్సాప్ ఆప్షన్ ఎంచుకొని ఆపై మై స్టేటస్‌లోకి వెళ్లి వాట్సాప్ అకౌంట్‌కి పోస్ట్ చేయాలి. కొన్ని సెకన్లలోనే మీకు ఇష్టమైన ట్రాక్ స్టేటస్‌లో కనిపిస్తుంది. మీ కాంటాక్ట్స్ వినడానికి, చూసేందుకు అందుబాటులో ఉంటుంది. దీని కోసం ముందుగా మీ ఫోన్‌లో స్పాటిఫై యాప్‌ను ఓపెన్ చేయాలి. ఆ తర్వాత పాట, ఆల్బమ్, పాడ్‌కాస్ట్‌ను ఎంపిక చేసుకోవాలి.మీరు షేర్ చేయాలనుకుంటున్న ట్రాక్‌ని ఎంచుకోవాలి. షేర్ బట్‌ను ప్రెస్ చేసి దిగువన లేదంటే కుడివైపున కనిపించే షేర్ సింబల్‌ని క్లిక్ చేయాలి. ఇందులో వాట్సాప్‌ని ఎంపిక చేసుకొని.. ఇక్కడ షేరింగ్ ఆప్షన్స్ నుంచి వాట్సాప్‌ని ఎంపిక చేయాలి. వాట్సాప్ ఓపెన్ అయ్యాక మై స్టేటస్‌ని ఎంచుకొని.. అనంతరం పోస్ట్‌పై క్లిక్ చేయాలి. దాంతో మీకు ఇష్టమైన మ్యూజిక్ మీ స్టేటస్‌లోకి వెళ్తుంది. మీ కాంటాక్ట్ లిస్ట్‌లో ఉన్న వారందరూ మీ స్టేటస్‌ను వినేందుకు అవకాశం ఉంటుంది. ఎవరైనా మీ స్టేటస్ నుంచి మ్యూజిక్ వినొచ్చు. ఈ ఫీచర్ అందరికీ అందుబాటులో లేదని.. త్వరలోనూ యూజర్లందరికీ అందుబాటులోకి వస్తుందని స్పాటిఫై చెప్పింది. ప్రస్తుతం స్పాటిఫైలో ఆప్షన్ కనిపించకపోతే.. త్వరలో రానున్న అప్‌డేట్‌లో ఖచ్చితంగా అందుబాటులోకి వస్తుందని చెప్పింది.

# క్రెడిట్‌కార్డులు తెగ వాడేస్తున్నారు..!

తక్కువ వేతనాలు కారణమట..! దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరుగుతోంది. ఈ ఏడాది తొలి ప్రథమార్థంలో దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన లావాదేవీలు 15శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ గణాంకాలు చెప్పాయి. ఇ-కామర్స్, ఫుడ్ డెలివరీతో పాటు ఇతర అవసరాల కోసం క్రెడిట్‌కార్డుల వినియోగం పెరిగినట్లు భావిస్తున్నారు. దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరుగుతోంది. ఈ ఏడాది తొలి ప్రథమార్థంలో దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన లావాదేవీలు 15శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ గణాంకాలు చెప్పాయి. ఇ-కామర్స్, ఫుడ్ డెలివరీతో పాటు ఇతర అవసరాల కోసం క్రెడిట్‌కార్డుల వినియోగం పెరిగినట్లు భావిస్తున్నారు. బ్యాంకులు సైతం ఈఎంఐ ఆఫర్లు, క్యాష్‌బ్యాక్, రివార్డ్ పాయింట్ల పేరుతో ఆఫర్లు సైతం ఇస్తున్నాయి. తాజాగా ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి.క్కువ ఆదాయం ఉన్న వ్యక్తులు క్రెడిట్‌కార్డులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్లు పేర్కొంది. థింక్ 360 ఏఐ అధ్యయనం ప్రకారం.. నెలకు రూ.50వేల కంటే తక్కువ జీతం ఉన్న వారిలో 93శాతం మంది క్రెడిట్‌కార్డులపై ఆధారపడుతున్నట్లు చెప్పింది. అదే సమయంలో స్వయం ఉపాధి పొందుతున్న 85శాతం మంది సైతం అధ్యయనం వెల్లడించింది. ఇప్పుడు పే తర్వాత (బీఎన్‌పీఎల్) సేవలను 18శాతం స్వయం ఉపాధి, వేతన జీవులు 15శాతం మంది ఉపయోగిస్తున్నట్లు డేటా పేర్కొంది. ఈ అధ్యయనం రూ.20వేల మంది ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులపై నిర్వహించింది. ఈ సందర్భంగా థింక్ 360 ఏఐ ఫౌండర్, సీఈవో అమిత్ దాస్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న భారతదేశ క్రెడిట్ ల్యాండ్ స్కేప్‌లో క్రెడిట్‌కార్డులు, బీఎన్‌పీఎల్ ఇప్పుడు వేతన జీవులతో పాటు ఉపాధి పొందుతున్న వారికి ప్రతీ ఒక్కరికీ అవసరంగా మారాయన్నారు. పెరుగుతున్న ఫిన్ టెక్ కంపెనీలు డిజిటల్ లోన్ రెవల్యూషన్‌ను తీసుకువచ్చాయన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీలు రూ.92వేల కోట్లకుపైగా వ్యక్తిగత రుణాలు ఇచ్చాయి. ఇది మొత్తం రుణాల సంఖ్యలో 76శాతం




ఉన్నట్లుగా సూచిస్తుందని పేర్కొన్నారు.

# భారత్‌లో టెస్లా ' మోడల్ కార్ల అమ్మకాలు..




ఎలాన్ మస్క్ కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో తొలి షోరూంను ప్రారంభించిన విషయం తెలిసిందే.ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ )కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం (టెస్లా భారత్‌లో తొలి షోరూంను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇవాళ ఉదయం ముంబై నడిబొడ్డున ఉన్న బాంద్రా కుర్లా కాంప్లెక్స్ లోని మేకర్ మ్యాక్సిటీ మాల్‌లో టెస్లా తన తొలి షోరూంను గ్రాండ్‌గా లాంచ్ చేసింది. ప్రస్తుతం ఎలక్ట్రిక్ కార్లలో అత్యధిక అమ్మకాలతో రికార్డు నెలకొల్పిన 'వై' మోడల్ కార్లను భారత వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది.భారత్‌లో (రియర్-వీల్ డ్రైవ్), లాంగ్-రేంజ్ వేరియంట్ కార్లను అమ్మకానికి ఉంచింది. ఇక ధర

రూ.59.89 లక్షల నుంచి ప్రారంభం ప్రపంచ కుబేరుడు

విషయానికొస్తే రియర్-వీల్ డ్రైవ్ (ఆర్‌డబ్ల్యూడీ) వేరియంట్ ధర రూ. 59.89 లక్షలు, లాంగ్-రేంజ్ ఆర్‌డబ్ల్యూడీ వేరియంట్ ధరను రూ. 67.89 లక్షలుగా నిర్ణయించింది. వీటి 'ఆన్ రోడ్' ధరల్ని పరిశీలిస్తే వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 61.07 లక్షలుకాగా, లాంగ్-రేంజ్ వెర్షన్ ఆన్-రోడ్ ధర రూ. 69.15 లక్షలుగా ఉంది. టెస్లా అధికారిక వెబ్‌సైట్ ప్రకారం, ఇందులో 18 శాతం జీఎస్టీతో సహా రూ. 50,000 అడ్మినిస్ట్రేషన్, సర్వీస్ ఫీజు కూడా ఉంటుంది.ఈ వాహనాలు చైనాలోని టెస్లా షాంఘై గిగాఫ్యాక్టరీ నుంచి దిగుమతయ్యాయి. ఈ వై మోడల్ వేరియంట్ ధరలు అమెరికాలో 44,990 డాలర్లు (భారత కరెన్సీలో రూ.38.63 లక్షలు), చైనాలో 2,63,500 యువాన్ (రూ.31.57 లక్షలు), జర్మనీలో 45,970 యూరోలు (రూ.46.09 లక్షలు)గా ఉన్నాయి. వీటితో పోలిస్తే భారత్‌లోనే ఈ వై మోడల్ ధరలు అధికం కావడం గమనార్హం. దిగుమతి సుంకం, లాజిస్టిక్స్ ఖర్చులే ధర పెరుగుదలకు కారణంగా తెలుస్తోంది

# ఓ మదుపరి మేలుకో.. పరిస్థితులకు తగ్గట్టు మారకపోతే ఉనికే ప్రశ్నార్థకం!

మన దేశంలో మధ్యతరగతి ప్రజానీకమే ఎక్కువ. ప్రతీ విషయంలో సర్దుకుపోయే వైఖరి.. అరకొర సదుపాయాలతో సహజీవనం.. కోరికల్ని చంపుకుంటూ ఆశల పల్లకిలో విహరించే మనస్తత్వం.. ఇవీ ఓ భారతీయ సగటు మధ్యతరగతి మనిషి గురించి చెప్పాలంటే గుర్తుకొచ్చే మాటలు. మన దేశంలో మధ్యతరగతి ప్రజానీకమే ఎక్కువ. ప్రతీ విషయంలో సర్దుకుపోయే వైఖరి.. అరకొర సదుపాయాలతో సహజీవనం.. కోరికల్ని చంపుకుంటూ ఆశల పల్లకిలో విహరించే మనస్తత్వం.. ఇవీ ఓ భారతీయ సగటు మధ్యతరగతి మనిషి గురించి చెప్పాలంటే గుర్తుకొచ్చే మాటలు. అయితే మారుతున్న పరిస్థితులకు తగ్గట్టు మనమూ మారకపోతే మన ఉనికే ప్రశ్నార్థకమయ్యే ప్రమాదమున్నది. అందుకే మిడిల్ క్లాస్ ఇన్వెస్టర్లు మేల్కోవాల్సిన సమయం ఆసన్నమైం దని అంటున్నారు ఆర్థిక నిపుణులు.సేఫ్ గేమ్ వద్దు..మధ్యతరగతి మదుపరులు ఎప్పుడూ సేఫ్ గేమ్‌కే మొగ్గుచూపుతారు. అయితే దీనివల్ల రాబడులకున్నమార్గాలుపరిమితమవుతాయనిఎక్స్‌పర్ట్స్‌హెచ్చరిస్తున్నారు. రక్షణాత్మక పెట్టుబడులు, వృద్ధిలేని ఆస్తులతో ఒరిగేదేమీ లేదని హెడ్జ్ ఫండ్ మేనేజర్, ఫిన్‌ఫ్లుయెన్సర్ అక్షత్ శ్రీవాత్సవ మాట. ఈ రకమైన ధోరణితో సంపద నెమ్మదిగా, మనకు తెలియకుండానే




కరిగిపోతుందని చెప్తున్నారు. నిజానికి చాలామంది తమ ఆదాయం పెరగగానే సురక్షిత పెట్టుబడి సాధనాలను ఎంచుకుని బ్యాడ్ ఇన్వెస్టింగ్‌కుబీజంవేస్తున్నారన్నది శ్రీవాత్సవ అభిప్రాయం. ఈక్విటీల్లోకి రావాలిస్టాక్ మార్కెట్ పెట్టుబడులు తీవ్ర ఆటుపోట్లకు లోబడి ఉన్నప్పటికీ..దీర్ఘకాలంలోమెరుగైనరాబడులనే ఒదిస్తాయని మెజారిటీ మార్కెట్ విశ్లేషకులు చెప్తున్నారు. కాబట్టి ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్లో అత్యధిక భాగం పీఎఫ్‌లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఒకటికి మించి ఇండ్ల కొనుగోళ్లుఇతరత్రాసంప్రదాయ మదుపు మార్గాలకే కేటాయించవద్దని సూచిస్తున్నారు. మార్కెట్‌లో ఇప్పుడున్న పరిస్థితులనుబట్టి 80 శాతందాకా స్మార్ట్, రిస్క్ ఆధారిత పెట్టుబడులకు ధైర్యం చేయవచ్చని అంటున్నారు. అయితే అందుకు తగ్గట్టుగా కట్టుదిట్టమైన ప్రణాళికలు కావాలి. ఉదాహరణకు సంపన్నులు ట్యాక్స్‌లను ఏ రకంగా పెట్టుబడిమార్గాలుగా మార్చుకుంటున్నారో పరిశీలించవచ్చు. ఆయా పెట్టుబడులతో పన్ను చెల్లింపులను బాగా తగ్గించేసుకుంటారు. కానీ మధ్యతరగతి వర్గాలు పొదుపును, పెట్టుబడిని విస్మరించి గుడ్డిగా పన్నులను చెల్లిస్తూపోతున్నారు. సరైన ప్రణాళికలుంటే ట్యాక్స్‌లనూ ఇన్వెస్ట్‌మెంట్స్ వైపునకు మళ్లించుకోవచ్చన్నది నిపుణుల సలహా. వ్యూహాత్మకంగా వ్యవహరిస్తే విజ యం ఖాయమే. ఇందుకు వెల్త్ మేనేజ్‌మెంట్, ట్రేడ్ ఎక్స్‌పర్ట్స్‌ను సంప్రదించడం తెలివైన పని. అనుభవంలేకుండాముందుకెళ్తేనష్టాలుఎదురుకావచ్చు మరి. గుర్తుంచుకోండి..పిల్లల చదువు, పెండ్లిళ్లు, జీవిత-ఆరోగ్య బీమా, ఆరోగ్య సమస్యలు, రిటైర్మెంట్ అనంతర జీవితం అన్నింటినీ దృష్టిలో పెట్టుకొని చక్కని రోడ్‌మ్యాప్‌ను చిన్న వయసులోనే వేసుకుంటే సత్ఫలితాలుంటాయి. ఉద్యోగ జీవితం ప్రారంభమైన దగ్గర్నుంచే పెట్టుబడులకు పెద్దపీట వేయాలి. ఎంత తక్కువ వయసులో బీమాను తీసుకుంటే అంత ఎక్కువ లాభం ఉంటుంది.ల్లో వేసి నగదుగా మార్చుకోవచ్చు) మొదలైనవి కూడా ఉంటాయి

# మార్కెట్‌కు హెచ్-1బీ సెగ!.. ఐటీ, స్థిరాస్తి రంగాల్లో అమ్మకాల ఒత్తిడి!

ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్లను హెచ్-1బీ వీసాల ఫీజు పెంపు నిర్ణయం గట్టిగానే ప్రభావితం చేయవచ్చనిపిస్తున్నది. ముఖ్యంగా భారతీయ ఐటీ రంగ సంస్థల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోవచ్చని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్లను హెచ్-1బీ వీసాల ఫీజు పెంపు నిర్ణయం గట్టిగానే ప్రభావితం చేయవచ్చనిపిస్తున్నది. ముఖ్యంగా భారతీయ ఐటీ రంగ సంస్థల షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోవచ్చని మెజారిటీ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. దీంతో లాభాల స్వీకరణకు ఆస్కారం ఉందనే చెప్పవచ్చు. నిజానికి సూచీల అప్‌ట్రెండ్‌కు గతవారం చివరి రోజునే బ్రేకులుపడ్డాయి. మదుపరులు అమ్మకాలకే పెద్దపీట వేశారు. అయినప్పటికీ అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారంలోనూ సూచీలు పుంజుకున్నాయి.ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్‌ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్




ఎప్పట్లాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలు ముఖ్యమే.కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 25,000 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,800 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,600-25,800 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు. జీఎస్టీ ఉత్సాహం కనిపిస్తే ఎఫ్‌ఎంసీజీ, క్యాపిటల్ గూడ్స్, ఆటో రంగ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించవచ్చు.గమనిక: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్

# యూజర్లకు షాక్ ఇచ్చిన ఎయిర్‌టెల్.. రూ.189 ప్లాన్ నిలిపివేసిన కంపెనీ.. ఇకపై ఎంట్రీ లెవల్ ప్లాన్‌గా రూ.199..!


ప్రముఖ టెలికం సంస్థ ఎయిర్‌టెల్ మరోసారి తన ప్రీపెయిడ్ టారిఫ్ ప్లాన్లలో మార్పులు చేసింది. వినియోగదారులను షాక్ ఇస్తూ.. సంస్థ రూ.189 ప్లాన్ను పూర్తిగా నిలిపివేసింది. ఈ ప్లాన్ స్థానంలో రూ.199 విలువైన కొత్త ప్లాన్‌ని ఎంట్రీ లెవల్ ఆఫర్‌గా ప్రకటించింది. ప్రముఖ టెలికం సంస్థ ఎయిర్‌టెల్ మరోసారి తన ప్రీపెయిడ్ టారిఫ్ ప్లాన్లలో మార్పులు చేసింది. వినియోగదారులను షాక్ ఇస్తూ.. సంస్థ రూ.189 ప్లాన్ను పూర్తిగా నిలిపివేసింది. ఈ ప్లాన్ స్థానంలో రూ.199 విలువైన కొత్త ప్లాన్‌ని ఎంట్రీ లెవల్ ఆఫర్‌గా ప్రకటించింది. ఈ తాజా ప్లాన్ ఎయిర్‌టెల్ అధికారిక వెబ్‌సైట్‌తో పాటు థర్డ్ పార్టీ రీఛార్జ్ యాప్స్‌లో కూడా అందుబాటులో ఉంది. ఇందులో వినియోగదారులకు అపరిమిత వాయిస్ కాలింగ్ సౌకర్యంతో పాటు ఎస్ఎంఎస్ బెనిఫిట్స్ కూడా లభిస్తాయి. మునుపటి రూ.189 ప్లాన్ 21 రోజుల వ్యాలిడిటీతో అందించేంది. అందులో వన్ జీబీ మొబైల్ డేటా, 300 ఎస్ఎంఎస్‌లు, అపరిమిత లోకల్, ఎస్‌టీడీ, రోమింగ్ కాల్స్ సౌకర్యం ఉండేది. ఇక కొత్త రూ.199 ప్లాన్‌లో 28 రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది.ఈ ప్లాన్ ప్రధానంగా తక్కువగా ఇంటర్‌నెట్ ఉపయోగించే కస్టమర్లను దృష్టిలో ఉంచుకుని రూపొందించింది. ఇందులో రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు, అపరిమిత కాలింగ్ సౌకర్యం, మొత్తం 2 జీబీ మొబైల్ డేటా అందివ్వనున్నది. డేటా లిమిట్ పూర్తయిన తర్వాత ప్రతీ ఎంబీకి రూ.0.5 చొప్పున అదనంగా ఛార్జ్ వర్తిస్తుంది. ఆ తర్వాత అందుబాటులో ఉన్న ప్లాన్ ధర రూ.219. ఇటీవలి కాలంలో టెలికాం రంగంలో ధరల పెరుగుదల నేపథ్యంలో ఎయిర్‌టెల్ ఈ మార్పులను తీసుకువచ్చింది. కొత్త ధరలు అమల్లోకి రావడంతో వినియోగదారులపై అదనపు ఆర్థిక భారం పడే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

# మళ్లీ 1.30 లక్షలకు పుత్తడి.. రూ 3 వేలు పెరిగిన పదిగ్రాముల ధర




బంగారం మళ్లీ దూసుకుపోతున్నది. అంతర్జాతీయంగా డిమాండ్ పుంజుకోవడం, డాలర్ బలహీనపడటంతో దేశీయంగా బంగారం ధరలు భారీగా పుంజుకున్నాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర గురువారం ఒకేరోజు రూ.3 వేలు ఎగిసి రూ.1,30,900కి చేరుకున్నట్టు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. బంగారం మళ్లీ దూసుకుపోతున్నది. అంతర్జాతీయంగా డిమాండ్ పుంజుకోవడం, డాలర్ బలహీనపడటంతో దేశీయంగా బంగారం ధరలు భారీగా పుంజుకున్నాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పుత్తడి ధర గురువారం ఒకేరోజు రూ.3 వేలు ఎగిసి రూ.1,30,900కి చేరుకున్నట్టు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ ముగియడంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను సురక్షితమైన బంగారం వైపు మళ్లించడంతో వీటి ధరలు పుంజుకున్నాయని వెల్లడించింది.వరుసగా మూడు రోజులుగా పెరుగుతూ వచ్చిన ధరలు గురువారం మరో మెట్టు పైకి చేరుకున్నాయి. 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ కూడా అంతే స్థాయి ఎగబాకి రూ.1,30,300గా నమోదైంది. మరోవైపు వెండి ఆకాశమే హద్దుగా దూసుకుపోయింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు పుంజుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.7,700 ఎగబాకి రూ.1,69,000కి చేరుకున్నది.బుధవారం కూడా వెండి రూ.5,540 పెరిగి రూ.1,61,300కి చేరుకున్న విషయం తెలిసిందే. దీంతో వరుసగా రెండో రోజుల్లో వెండి ఏకంగా రూ.13 వేలు పెరిగినట్టు అయింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 4,236.84 డాలర్లకు చేరుకోగా, వెండి 53.86 డాలర్లకు ఎగబాకింది.

# ఈ దేశంలో వ్యాపారం కష్టమే.. అసోచామ్ తాజా నివేదికలో తేటతెల్లం సంక్లిష్టకర విధానపరమైన అడ్డంకులు




సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)ల అభివృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. దేశీయ వ్యాపార, పారిశ్రామిక సంఘం అసోచామ్ ఇప్పుడిదే చెప్తున్నది. 'భారతీయ రాష్ట్రాల్లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరిట గురువారం ఓ నివేదికను అసోచామ్ విడుదల చేసింది. సమస్యల సుడిగుండంలో ఎంఎస్ఎంఈలుప్రభుత్వాల నుంచి కొరవడిన ప్రోత్సాహంప్రతిబంధకాలుగా రెగ్యులేటరీ సవాళ్లువేధిస్తున్న సింగిల్ విండో వ్యవస్థల కొరతతెలంగాణ, ఆంధ్రప్రదేశ్, గుజరాత్, తమిళనాడు, కేరళ, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒడిషా, హిమాచల్ ప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్, దాద్రా అండ్ నగర్ హవేలీ, గోవా, జమ్ముకశ్మీర్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో రెగ్యులేటరీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సమస్యల్ని అసోచామ్ తమ నివేదికలో ప్రధానంగా ప్రస్తావించడం గమనార్హం. భూమి, భవన-నిర్మాణ, కార్మిక, పర్యావరణ, వాణిజ్య, పన్నులు, మౌలిక సదుపాయాలు తదితర రంగాల్లో ఇబ్బందికర పరిస్థితులున్నట్టు తేల్చింది.న్యూఢిల్లీ, నవంబర్ 13: సంక్లిష్టకర విధానపరమైన అడ్డంకులు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)ల అభివృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయి. దేశీయ వ్యాపార, పారిశ్రామిక సంఘం అసోచామ్ ఇప్పుడిదే చెప్తున్నది. 'భారతీయ రాష్ట్రాల్లో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' పేరిట గురువారం ఓ నివేదికను అసోచామ్ విడుదల చేసింది. రెగ్యులేటరీ జాప్యాలు, వ్యయాలు, ప్రభావవంతమైన సింగిల్ విండో వ్యవస్థల కొరత వంటివి ఎంఎస్ఎంఈల వ్యాపార నిర్వహణను కష్టతరం చేస్తున్నాయని పేర్కొన్నది.దేశంలోని ప్రధాన రాష్ట్రాల్లో కీలక రెగ్యులేటరీ, మౌలికపరమైన అడ్డంకులు వ్యాపార కార్యకలాపాలకు అవరోధాలుగా ఉన్నాయని అసోచామ్ తమ నివేదికలో స్పష్టం చేసింది. జీఎస్టీ సంబంధిత సమస్యలు, సంక్లిష్టమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియలు, రిఫండ్‌లో ఆలస్యాలు, తరచూ ఐటీసీ వివాదాలు, ఈ-వే బిల్లుల వంటి రవాణా, విద్యుత్తు సరఫరా తదితర మౌలిక సదుపాయాల కల్పనకు నిబంధనల్లో అస్పష్టత వంటివి ఎంఎస్ఎంఈలకు పెను భారంగా ఉన్నాయి.కాగా, ఆంధ్రప్రదేశ్, ఒడిషా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో అమలవుతున్న వ్యవస్థలు గాడితప్పాయన్న అసోచామ్.. వెంటనే జవాబుదారీతనంతో కూడిన వ్యవస్థలతో వాటిని క్రమబద్ధీకరించాలని, మల్టీపుల్ విండోల స్థానంలో సింగిల్ విండో సిస్టమ్స్‌ను తీసుకురావాలని నొక్కిచెప్పింది. డిజిటలైజ్డ్, సమర్థవంతమైన సింగిల్ విండో వ్యవస్థలు రాష్ట్రాల్లో పెట్టుబడు లకు దోహదం చేస్తాయని గుర్తుచేసింది.




# రాజమౌళి బిగ్ ఈవెంట్.. హెూస్ట్‌గా ప్రముఖ యూట్యూబర్!

మహేష్ బాబు - రాజమౌళి కాంబోలో వస్తోన్న యాక్షన్ అడ్వెంచరస్ మూవీ ఎస్ఎస్ఎంబీ29. ఇటీవలే ఈ సినిమాకు సంబంధించి బిగ్ సర్‌ప్రైజ్ ఇచ్చాడు మన దర్శకధీరుడు. ఓ సాంగ్‌ను రిలీజ్ చేయడంతో ప్రియాంక చోప్రా ఫస్ట్ లుక్ రివీల్ చేశారు. అయితే ఈ మూవీ టైటిల్‌పై ఫ్యాన్స్‌లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. టైటిల్ ఎప్పుడెప్పుడు రివీల్ చేస్తారా? అని మహేశ్ బాబు ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలోనే రాజమౌళి బిగ్ ఈవెంట్ ప్లాన్ చేశారు. హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో బిగ్ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. ఈ నెల 15న గ్రాండ్ ఈవెంట్ జరగనుంది. ఈ వేడుకలో భాగంగా మూవీ టైటిల్‌తో పాటు మహేష్ బాబు ఫస్ట్ లుక్‌ను రివీల్ చేయనున్నారు. దీంతో భారీగా ఫ్యాన్స్ రానున్న నేపథ్యంలో దర్శకుడు రాజమౌళి కొన్ని సూచనలు ఇస్తూ ఒక వీడియో విడుదల చేశారు. ఈవెంట్ పాస్‌లు ఉన్నవాళ్లకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన క్లారిటీ ఇచ్చారు. అయితే తాజాగా ఈ ప్రతిష్టాత్మక గ్రాండ్ ఈవెంట్‌కు హెూస్ట్ ఎవరన్నది కూడా టాలీవుడ్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. ఇలాంటి పెద్ద పెద్ద ఈవెంట్లకు మన స్టార్ యాంకర్ సుమ ఉండనే ఉంటుంది. సుమతో పాటు ప్రముఖ యూట్యూబర్ ఈ మెగా ఈవెంట్‌కు హెూస్ట్‌గా పనిచేయనున్నారు. బాలీవుడ్‌కు చెందిన ఆశిష్ చంచలానీ హెూస్ట్‌గా కనిపించనున్నారు. ఈ విషయాన్ని ఓ ఫన్నీ వీడియో ద్వారా మేకర్స్ రివీల్ చేశారు. రాజమౌళితో కలిసి ఈ వీడియోను రూపొందించారు. కాగా.. తొలిసారి రాజమౌళి- మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న ఈ భారీ ప్రాజెక్ట్‌కు గ్లోబ్ ట్రాటర్ ?అనే టైటిల్ ఖరారు చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ బిగ్ ఈవెంట్‌లో ఈ విషయాన్ని రివీల్ చేయనున్నారు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌కు దాదాపు 50 వేల మందికి పైగా అభిమానులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నవంబర్ 15న సాయంత్రం 7 గంటలకు జియోహాట్‌స్టార్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు.

# ‘కొదమ సింహం’ రీరిలీజ్.. అదిరిపోయేలా ట్రైలర్




మెగాస్టార్ చిరంజీవి నటించిన కొదమసింహం రీరిలీజ్ కానుంది. 1990లో విడుదలైన ఈ చిత్రంలో కౌబాయ్‌గా చిరు కనిపించారు. ఈనెల 21న సరికొత్త హంగులతో పాటు 4కే విజువల్స్‌తో రీరిలీజ్ కానుంది. ఈ క్రమంలో తాజాగా ట్రైలర్‌ను షేర్ చేశారు. దర్శకుడు కె.మురళీమోహనరావు తెరెక్కించిన ఈ చిత్రంలో సోనమ్, వాణీ విశ్వనాథ్,రాధ,సుజాత,అన్నపూర్ణ నటించగా మోహన్‌బాబు ముఖ్యపాత్ర పోషించారు. ఈ మూవీని కైకాల నాగేశ్వరరావు నిర్మించారు. ఇప్పుడు కూడా ఆయనే ఈ చిత్రాన్ని 5.1 డిజిటల్ సౌండింగ్‌తో చేయించి మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం విశేషం. ఇది ‘హంటర్స్ ఆఫ్ ది ఇండియన్ ట్రెజరీ’ అనే పేరుతో ఆంగ్లంలోకి అనువదించబడిన మొట్టమొదటి దక్షిణభారత చలనచిత్రంగా కొదమసింహం రికార్డ్ క్రియేట్ చేసింది. కౌబాయ్ పాత్రలని అంతకు ముందు ఎక్కువగా ఘట్టమనేని కృష్ణ పోషించేవారు. ఈ చిత్రంతో చిరంజీవి మొట్టమొదటి సారిగా పూర్తి నిడివి కౌబాయ్ పాత్రని పోషించారు. బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్స్ రాబట్టిన ఈ మూవీ 20 కేంద్రాల్లో శత దినోత్సవం జరుపుకుంది. ఇందులోని పాటలు ‘జపం జపం జపం, కొంగ జపం’, ‘చక్కిలిగింతల రాగం’, ‘గుం గుమాయించు కొంచెం’ బాగా పాపులర్ అయ్యాయి.

# ఫైట్ సీక్వెన్స్‌లో మన శంకర వర ప్రసాద్‌గారు.. చిరంజీవి టీం ఇప్పుడెక్కడుందో తెలుసా..?

టాలీవుడ్ స్టార్ యాక్టర్ చిరంజీవి టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం మన శంకర వర ప్రసాద్‌గారు ‘పండగకు వస్తున్నారు’ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తోన్న ఈ మూవీని అనిల్ రావిపూడి డైరెక్ట్ చేస్తున్నాడు. లేడీ సూపర్ స్టార్ నయనతార ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుంది. తాజాగా ఈ మూవీకి సంబంధించిన ఆసక్తిక వార్త ఒకటి బయటకు వచ్చింది. ప్రస్తుతం అనిల్ రావిపూడి టీం చిరంజీవిపై వచ్చే ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నట్టు సమాచారం. ఈ సీక్వెన్స్ ఫిలింనగర్ గోల్ఫ్ కోర్ట్ నేడు షురూ కాగా.. మరో రెండు రోజుల పాటు షూటింగ్ కొనసాగనుందట. ఈ షెడ్యూల్‌తో చిరంజీవికి సంబంధించిన టాకీ పార్ట్ పూర్తి కానుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే విడుదల చేసిన మీసాల పిల్ల సాంగ్ నెట్టింట మిలియన్ల సంఖ్యలో వ్యూస్ రాబడుతూ టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తోంది. ఈ మూవీలో వీటీవీ గణేశ్, కేథరిన్ థ్రెసా, హర్షవర్దన్, రేవంత్ భీమల (సంక్రాంతికి వస్తున్నాం) ఫేం బుల్లిరాజు) కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, సుస్మిత కొణిదెల-విష్ణు ప్రసాద్ హెూం బ్యానర్ గోల్డ్ బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ మూవీని 2026 సంక్రాంతి కానుకగా విడుదల చేయనుండగా.. రిలీజ్ డేట్‌పై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.






# మనం ముసలోళ్లమైనా బ్యాండ్ కొడుతనే ఉండు

## ఇంట్రెస్టింగ్‌గా రాజు-రాంబాయి ట్రైలర్

సిల్వర్ స్క్రీన్‌పై ఇప్పటివరకు మంచి సందేశాన్నిచ్చిచ్చే చాలా ప్రేమకథలు వచ్చాయని తెలిసిందే. అదే జోనర్‌లో వస్తున్న ప్రాజెక్ట్ రాజు - రాంబాయి. సాయిలు డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీలో అఖిల్ ఉడ్డెమారి, తేజస్వి (కమిటీ కుర్రోళ్లు ఫేం) హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈటీవీ ఒరిజినల్ మూవీగా వస్తోన్న ఈ చిత్రం నవంబర్ 21న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. హీరో క్యారెక్టర్ బ్యాండ్ బాజా మోగించే సీన్లతో మొదలైంది ట్రైలర్.. ఇక రాజు నువ్వెప్పుడు బ్యాండ్ కొడుతూనే ఉండు. మనకు పెళ్లైనా.. పిల్లలు పుట్టినా.. మనం ముసలోళ్లమైనా బ్యాండ్ కొడుతనే ఉండు సరే నా అంటూ హీరోయిన్ చెబుతున్న సాగుతున్న డైలాగ్స్ ఇంప్రెసివ్‌గా ఉన్నాయి. ఊళ్లో బ్యాండ్ కొట్టి జీవనం సాగించే రాజు అనే యువకుడికి చదువుకునే రాంబాయి అనే యువతికి మధ్య లవ్ ట్రాక్ నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్ హింట్ ఇచ్చేస్తుంది. ప్రేమ, పెళ్లి.. వాటి ద్వారా ఎదురయ్యే సమస్యలను చూపిస్తూ యూత్‌ను ఆలోచింపజేసేలా సినిమాను తెరకెక్కించినట్టు ట్రైలర్ ద్వారా తెలిసిపోతుంది. ఈ చిత్రానికి విరాటపర్వం డైరెక్టర్ వేణు ఊడుగుల వన్ ఆఫ్ ది ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు.

# ఈ అందాల సోయగాన్ని దేశంలో సగం మంది చంపాలనుకున్నారా.. అదా శర్మ సంచలన కామెంట్స్

ప్రముఖ నటి అదా శర్మ గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం చేయాల్సిన అవసరం లేదు. 2008లో దర్శకుడు విక్రమ్ భట్ తెరకెక్కించిన హారర్ మూవీ ‘1920’ తో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చిన అదా, తన నటనతో మొదటి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత టాలీవుడ్‌లో పూరి జగన్నాథ్ %-% నితిన్ కాంబినేషన్‌లో వచ్చిన ‘హార్ట్ ఎటాక్’ మూవీతో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. ఆ చిత్రంలోని ఆమె ప్రదర్శనకు మంచి ప్రశంసలు లభించాయి. తర్వాత ‘సన్నాఫ్ సత్యమూర్తి’, ‘క్షణం’, ‘కల్కి’ వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చోటు సంపాదించింది. అయితే ఆశించిన స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో ఆమె బాలీవుడ్‌పై దృష్టి పెట్టింది. తన అందం, గ్లామర్‌తో పాటు రిస్క్ ఉన్న పాత్రలను ఎంచుకోవడంలో అదా ఎప్పుడూ ముందుంటుంది. అదే ధైర్యం ఆమె కెరీర్‌ను పూర్తిగా మార్చేసింది. 2023లో విడుదలైన ‘ది కేరళ స్టోరీ’ అదా శర్మ జీవితానికి నిజమైన టర్నింగ్ పాయింట్ అయింది. ఈ లేడీ ఓరియెంటెడ్ సినిమా దేశవ్యాప్తంగా భారీ చర్చకు దారితీసింది. రాజకీయ వివాదాల మధ్య విడుదలైన ఈ చిత్రం రూ. 400 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ మూవీతో అదా ఒక్కసారిగా నేషనల్ లెవెల్‌లో పాపులర్ అయింది.ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అదా మాట్లాడుతూ.. “ది కేరళ స్టోరీ విడుదలైనప్పుడు సగం దేశం నన్ను చంపాలని అనుకుంది. కానీ మిగతా సగం దేశం నన్ను ప్రేమించి రక్షించింది. 1920 నుంచే నేను రిస్క్ ఉన్న రోల్స్ ఎంచుకుంటున్నాను. ఆ రిస్క్ వల్లే నేడు నాకు గుర్తింపు వచ్చింది. పాత్రలో భావోద్వేగం లేకపోతే నచ్చదు. యాక్షన్ సీన్లు ఉండాలి అని వెల్లడించింది. ఇక ప్రస్తుతం అదా శర్మ, దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ నివసించిన అదే ఫ్లాట్‌లో ఉంటోంది. ఆ ఇంట్లో సుశాంత్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ ఫ్లాట్‌ను చాలా మంది అద్దెకు తీసుకోవడానికి భయపడ్డా, అదా మాత్రం ధైర్యంగా అక్కడే ఉంటోంది.ఇటీవల ఆమె ‘బస్తర్: ది నక్సల్ స్టోరీ’ సినిమాలో శక్తివంతమైన పాత్రలో కనిపించింది. అదనంగా మరో యాక్షన్ థ్రిల్లర్ మూవీతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతోంది. సోషల్ మీడియాలో కూడా అదా యాక్టివ్‌గా ఉంటూ, తన ఇన్‌స్టాగ్రామ్ పోస్టులు, ఫిట్‌నెస్ వీడియోలు, డాన్స్ క్లిప్స్, గ్లామరస్ ఫోటోషూట్లతో తరచూ ట్రెండింగ్‌లో నిలుస్తోంది. సవాలు ఉన్న పాత్రలతోనే అదా శర్మ తనదైన ముద్ర వేసుకుంటూ బాలీవుడ్‌లో సత్తా చాటుతోంది.



Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332